ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0

డ్రాప్ అవుట్‌లు లేకుండా తనిఖీలు చేయండి : కలెక్టర్

ఏలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బడిఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని, ఎక్కడా డ్రాపవుట్లు లేకుండా చూసేలా తనిఖీలు నిర్వహించాలని విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో సోమవారం ఆమె అధికారులతో డ్రాపవుట్లపై సమీక్షిస్తూ పాఠశాల, గ్రామ, మండలస్థాయిలో నిర్ధారించి ఈ నెల 25వ తేదీలోగా తీర్మానం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

అగ్రిగోల్డ్ భూములు పరిశీలిస్తాం : జేసీ

ఏలూరు,జూలై 21(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ ఆస్తులకు సంబంధించి సేల్ డీడ్‌లను అనుసరించి జిల్లాలో ఉన్న భూముల పరిశీలనను చేపట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని జేసీ ధాత్రిరెడ్డి రాష్ట్ర భూపరిపాలన కమిషనర్(సీసీఎల్‌ఏ) జి.జయలక్ష్మికి సోమవారం వివరించారు. ఈ అంశంపై జయలక్ష్మి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించగా జేసీ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ భూములకు ప్రభుత్వ మార్కెట్ విలువలు, మ్యుటేషన్లపైన నివేదికను అందిస్తామన్నారు.



వ్యవసాయ శాఖ సందేశ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

ఏలూరుసిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి):రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలనే సందేశ పోస్టర్లను కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఆధ్వర్యంలో కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం- ప్రణమ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. రైతులు జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులు ఉపయోగించి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌బాషా, జడ్పీ సీఈవో శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

మలేరియా.. మందుల్లేవ్!

- ఏజెన్సీలోని పీహెచ్‌సీలకు నిలిచిన మలేరియా మందుల సరఫరా
- ఇబ్బందులు పడుతున్న గిరిజనం

■ లోపలి పేజీలో..

జనం చెంతకు.. తొలి అడుగు

ఏడాది విజయాలను వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..

తెలుగుదేశం ప్రభుత్వం ఏడాది విజయాలను ప్రజలకు వివరిస్తూ వారి మన్ననలను పొందడమే కాకుండా స్థానిక సమస్యలపైన స్పందించేందుకు తొలి అడుగు వేసి మూడు వారాలైంది. సూపర్‌సిక్స్‌తో పాటు గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమించి ప్రజాపాలన వైపు సాగిన తీరును ఊరూ,వాడా వివరించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు పేరిట పార్టీ యంత్రాంగం జనం మధ్యకు చేరింది. కొన్ని నియోజకవర్గాల్లో కార్యకర్త దగ్గర్నుంచి ఎమ్మెల్యే వరకు చెమటోడ్చారు. ప్రభుత్వంలో భాగస్వామ్యులైన జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలున్న నియోజక వర్గాల్లోను మండలస్థాయి నేతలు తొలి అడుగు విజయవంతంగా కొనసాగిస్తున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి)

- మూడు వారాల్లో కొన్నిచోట్ల భారీగా చొరవ
- దెందులూరు,ఏలూరు,నూజివీడుల్లో టాప్
- ప్రజల మధ్యకు ఎమ్మెల్యేలు, నేతలు
- రోజువారీ సమీక్షిస్తున్న తెలుగుదేశం నాయకత్వం
- స్థానిక సమస్యలతో పాటు పెండింగ్ పైన జనం ప్రస్తావన

ఏడాది పాలనలో ఎన్నో మార్పులు, చేర్పులు. ప్రజలు మెచ్చేలా కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే చెమటోడ్చుతున్నారు. మరికొన్ని చోట్ల పార్టీ నేతలే అన్నీతామై కరపత్రాలతో సహా గడపగడపకూ వెళుతున్నారు. గడిచిన ఏడాది కాలంలో చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూ, ఇప్పటివరకు చేసిన సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను వారి ఎదుట ఏకరవు పెట్టడమే కాకుండా ప్రజలను తప్పుదారి పట్టించేలా వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టడంలో కొంత సక్సెస్ అయ్యారు. పౌరసరఫరాల విభాగంలో ఇంటింటికి రేషన్ కింద ఇన్నాళ్లు కొనసాగిన వ్యవస్థను తప్పించి పాత పద్ధతిలోనే డీలర్ల ద్వారానే రేషన్ అందించే విధానాన్ని ప్రజలకు వివరిస్తున్నప్పుడు అత్యధికులు ఈ పద్ధతినే స్వాగతిస్తున్నట్టు కనిపిస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన లోపాలను తెలుగుదేశం ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను వివరిస్తున్నప్పుడు ప్రజాసానుకూలతే కనిపిస్తున్నట్టు ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ప్రత్యేకించి గతంలో ఒకవర్గం వైసీపీ ముసుగేసుకుని మరీ ఏకపక్షంగా వ్యవహరించిన విధానాన్ని గ్రామీణప్రాంతాల్లో అత్యధికులు బహిరంగంగా వ్యాఖ్యలు చేయడంతో గడపగడపకూ వెళుతున్న పార్టీశ్రేణులే ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇంకోవైపు పింఛన్లు, రేషన్‌లతో పాటు తల్లికి వందనం కింద సంతృప్తికరంగా బ్యాంకుల్లో డబ్బులు పడ్డాయని కొందరు హర్షామోదాలు వ్యక్తం చేస్తుండగా, అన్నదాత సుఖీభవ కింద ఇంకా నగదు జమ కాకపోవడం తొలి అడుగులో ప్రస్తావనకు వస్తోంది. పనిలోపనిగా లిక్కర్ స్కాంను టీడీపీ నేతలు ప్రస్తావిస్తున్నప్పుడు తాగుబోతులనే ముద్రవేసి కొంప కొల్లేరు చేశారని, ఏది పడితే ఆ 'మందు' ఎక్కువగా అమ్మి జేబులో వేసుకున్నారు. ఇదిగో ఇప్పుడు అనుభవిస్తున్నారని కామెంట్లు వినిపించడం విశేషం. దీనికి తోడు వితంతు పింఛన్లు ఇంకా అందుబాటులోకి రాకపోవడం ముఖ్యమంత్రి స్వయంగా తేదీలు ప్రకటించినా ఇప్పటికీ అమలు కాకపోవడాన్ని స్థానికులు ప్రస్తావిస్తున్నారు. ఇక మరమ్మతులకు నోచుకోని రోడ్లు, నిర్మాణంలో అర్థాతరంగా నిలిచిన పక్కా ఇళ్ల గురించి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం నిమిత్తం రూ.33 వేలు చెల్లించామని, ఇప్పుడు ఆ సొమ్ము వెనక్కి ఇవ్వకపోగా నిర్మాణం చేయకుండా చేతులెత్తేశారని ఆగ్రహం అక్కడక్కడ కనిపిస్తోంది. టిడ్కో ఇళ్ల విషయాన్ని, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లలో సవరణలు, భూ వివాదాలు సానుకూలంగా పరిష్కారం కావట్లేదని, ఏదొక వంక చూపించి అధికారులు దాటవేత ధోరణి అవలంభిస్తున్నారని కొందరు ఫిర్యాదులు చేస్తున్నారు.



ఏలూరులో తొలిఅడుగు కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

మంచి మార్కుల కోసం..

తెలుగుదేశం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కొందరు ఎమ్మెల్యేలు సాధ్యమైనంత మేర ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి సమాంతరంగా దెందులూరు సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పోటాపోటీగా ఊరూరా తిరుగుతున్నారు. ఆరంభం నుంచి ఇప్పటివరకు ఎక్కడా గ్యాప్ లేకుండా నిత్యం ఎంపిక చేసిన గ్రామాల వైపు తొలి అడుగు వేస్తున్నారు. స్థానికులతో మమేకం అవుతున్నారు. ఏలూరు నగరంలో డివిజన్ల వారీగా బాధ్యులను వెంటబెట్టుకుని ప్రజాక్షేత్రం వైపు ఎమ్మెల్యే బడేటి చంటి అడుగులు వేస్తున్నారు. ప్రజలకు చేరువగా వెళ్లటం, వారి మంచి చెడ్డలను అడిగి తెలుసుకోవడం, స్థానిక సమస్యలను కొద్దిరోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తామని భరోసా ఇస్తున్నారు. దెందులూరు తొలి అడుగు కార్యక్రమం ఒక పండుగలా సాగుతోంది. ఎమ్మెల్యే ప్రభాకర్ తనదైన (మిగతా 8వ పేజీలో)



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అర్జీల పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించండి : కలెక్టర్

ఏలూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అర్జీల పరిష్కారంలో బాధ్యతయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి, డీఆర్డీఏ పీడీ విజయరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఎస్‌డీసీ భాస్కర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 398 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించి, అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఎస్పీ కార్యాలయంలో 46 ఫిర్యాదులు

ఏలూరు క్రైం : ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఫిర్యాదులను సమీప సబ్‌డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లోను ప్రతి సోమవారం అందజేయవచ్చని ఏఎస్పీ సూర్యచంద్రరావు ప్రజలకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 46 మంది ఫిర్యాదులు అందించారు. వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు ఇచ్చారు.ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ విధానంలో ఫిర్యాదులను వీడియో రికార్డింగ్ చేశారు.

ఐటీడీఏ ఏపీవోగా శ్రీనివాసరావుకు బాధ్యతలు

బుట్టాయగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి):కేఆర్‌పురం ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసరుగా ఎం.శ్రీనివాసరావుకు పీవో కె.రాములు నాయక్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో డిప్యూటీ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఏటీడబ్ల్యువో శ్రీవిద్య ఏపీవోగా, డీడీగా పనిచేస్తున్నారు. ఆమెకు డీడీగా , శ్రీనివాసరావుకు ఏపీవోగా బాధ్యతలు అప్పగించారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

మాకు న్యాయం చేయండి

- వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

వేలేరుపాడు, జూలై 21(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ముంపునకు గురవుతున్న గ్రామాలను గుర్తించే విషయంలో అధికారులు చేస్తున్న పొరపాట్ల కారణంగా తాము తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని 41వ కాంటూరులో ముంపునకు గురయ్యే గ్రామాలను 45వ కాంటూరులో చేర్చి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపిస్తూ సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఐదు గ్రామాల ప్రజలు ముట్టడించారు. గతంలో వచ్చిన సాధారణ వరదలకే సుద్దగుంపు, తాట్కూరుగొమ్ముకాలనీ, నిడిమిగొమ్ముకాలనీ, ఎర్రబోరు, తాతాపోచిరాల తదితర గ్రామాలు మునిగి తీవ్రనష్టం కలిగిందన్నారు. తమ గ్రామాలను 41వ కాంటూరులో కలిపి పోలవరం నష్టపరిహారాలు అందించాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి గోడు వెళ్లిబుచ్చుకున్న తమను పట్టించుకోవడంలేదన్నారు. తొలుత సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్,సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీల ఆధ్వర్యంలో అఖిలపక్షం వందలాది మంది నిర్వాసితులతో అంబేడ్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించి కార్యాలయం ముట్టడించారు. డీటీ సురేంద్రకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. అఖిలపక్షం తరపున సీపీఐ నుంచి ఎండీ మున్నీర్, కారం దారయ్య, బాడిస రాము, గంగరాజు, సీపీఎం నుంచి ధర్ముల రమేశ్, మడిమి దుర్గారావు, కాంగ్రెస్ నుంచి సత్తిపండు, వలగాని తమ్మయ్య, ఇబ్రహీం, సీపీఐఎంఎల్ ప్రజాపంథా నుంచి సిరికొండ రామారావు, ముత్యాలరావు, గిరిజన సంఘం నుంచి బంధం ప్రసాద్, ముతత్యాలు, ఐదుగ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల ఆలయం వద్ద వర్షం

అల్పపీడనం.. వర్షాల జోరు

ఏలూరుసిటీ/ద్వారకాతిరుమల/పోలవరం/పెదపాడు/ముసునూరు/ముదినేపల్లి/చింతలపూడి,జూలై 21(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా బలపడడంతో జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, ఈనెల 24న మరో అల్పపీడనం ఏర్పడుతుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ వర్షాలు సార్వా పంటల సాగుకు అనుకూలిస్తాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. గత 24 గంటల్లో అత్యధికంగా మండవల్లి మండలంలో 33.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 5.8 మి.మీ నమోదైంది. కామవరపుకోట 25.2, పెదపాడు 24.8, ముదినేపల్లి 20.2, ఆగిరిపల్లి 16.2, ద్వారకాతిరుమల 10.2, కైకలూరు 7.4, ఏలూరు అర్బన్ 7.2, కలిదిండి 4.8, ఏలూరు రూరల్ 4.6, చాట్రాయి 2.8, వేలేరుపాడు 2.6, జీలుగుమిల్లి 1.4, నిడమర్రు 0.6, దెందులూరు 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి వచ్చిన భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. పోలవరం మెయిన్ బజార్, బెస్తావీధి, కమ్మరగూడెం, నూతనగూడెం, కొత్తపేట, బాపూజీ కాలనీలలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెదపాడు మండలంలో ఉదయం నుంచి వర్షం కురవడంతో కూలీలు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ముసునూరు మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. కొద్దిపాటి వర్షానికే ముసునూరులో అంతర్గత, ప్రధాన రహదారులపై వర్షపునీరు ప్రవహించింది.

వర్షంతో రైతులకు ఊరట

గత పదిహేను రోజులుగా సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ముదినేపల్లి ప్రాంత రైతాంగం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. సార్వా వరి నారుమళ్లకు, వెదజల్లిన వరి పైరుకు వర్షం జీవం పోసింది. చింతలపూడి మండలంలో వెదజల్లే విధానం ద్వారా వరి సాగు చేస్తున్న రైతులు వర్షాలతో ఊపిరి పీల్చుకున్నారు. చింతలపూడి మండలంలో సుమారు 13 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. ఇప్పటివరకు కేవలం ఐదు వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. ఇవికూడా నీరు లేక ఎండు దశకు వచ్చాయి. ఈ నేపథ్యంలో కురిసిన వర్షంతో రైతులకు మేలు చేకూర్చగా వెదజల్లే వరిసాగులో ఎండిన చోట్ల తిరిగి విత్తనాలు చల్లుతున్నారు. వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగితే చెరువుల కింద కూడా సాగయ్యే అవకాశం ఉంది.

రైస్ కార్డుల కోసం ఎదురుచూపులు

ఏలూరుసిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): కొత్త రైస్‌కార్డుల కోసం జిల్లాలో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ హయాంలో కార్డులు జారీకాక వేలాది మంది పేదలు ప్రభుత్వ పథకాలకు అర్హులు కాలేకపోయారు. పైపైచ్చు వివిధ రకాల కారణాలతో అర్హత ఉన్నవారి కార్డులను తొలగించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. గత మే 14 వతేదీ నుంచి జిల్లాలోని సచివాలయాల పరిధిలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

దరఖాస్తులు 50,693

జిల్లాలో కొత్త కార్డులతో పాటు ప్రభుత్వం పేర్కొన్న ఏడు రకాల సేవలకు సంబంధించి 50,693 దరఖాస్తులు వచ్చాయి. కార్డుల్లో పేర్లు చేర్చాలని 35,127, పేర్లు మార్పులు 293, ఆధార్ తప్పులు సరిచేయాలని 462, అడ్రస్‌లు మార్పు చేయాలని 1,943, పేర్లు తొలగించాలని 1,381, విభజించాలని 6,348, కార్డులు సరండర్ చేసుకోవాలని 20, కొత్త రైస్ కార్డులు జారీ చేయాలని 5,119 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు 48,925 దరఖాస్తులను అప్రూవల్ చేశారు. త్వరలోనే కార్డులు అందనున్నాయి. జిల్లాలో ఇప్పటికే 6,20,000 రేషన్ కార్డులు ఉన్నాయి.

ఇక డిజిటల్ కార్డులు

త్వరలో ఇవ్వనున్న కొత్త రేషన్‌కార్డులను రైస్‌కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఇవి పూర్తిగా ఏటీఎం కార్డుల తరహాలో కొత్తగా డిజైన్ చేశారు. వీటిపై క్యూ ఆర్ కోడ్ దర్శనమిస్తుంది. రేషన్ దుకాణాల్లో సరుకులు తీసుకున్న తర్వాత డీలర్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలపవచ్చు.



అరకొర బస్సులతోనే.. రైట్ రైట్!

- జిల్లాకు కేటాయింపు లేని విద్యుత్ బస్సులు..తొలిదశలో మొండిచేయి..
- రెండోదశలోనైనా కేటాయిస్తారా..?
- పాలకులు, ఆర్టీసీ చైర్మన్లు స్పందిస్తారా?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) :

జిల్లాలో అరకొర బస్సులతోనే ప్రయాణికులు సతమతమవుతూ రాకపోకలు సాగిస్తున్నారు. చాన్నాళ్ల నుంచి విద్యుత్ బస్సులు మన కేటాయింపులు జరుపుతారని ఆశించినా అది జరగలేదు. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ-బస్సులను 11 నగరాలకు 750 బస్సులను కేటాయింపులను చేపట్టారు. ప్రధానంగా విజయవాడకు 100, గుంటూరు 100, నెల్లూరుకు 100, విశాఖ, గాజువాక, కర్నూలు, కాకినాడ, రాజమండ్రి, కడప, అమరావతి, తిరుపతి, అనంతపురానికి 50 చొప్పున ఈ-బస్సులను కేటాయించారు. అయితే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో కేటాయించిన నగరాలకూ ఇంకా బస్‌లు రాలేదని చెబుతున్నారు. వివిధ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పెంచాల్సి ఉండగా, ఆ దిశగా కసరత్తులు జరగడం లేదు. విద్యుత్ బస్సులు మన జిల్లాకు రెండో దశలో కేటాయించే అవకాశాలున్నట్లు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. అయితే విద్యుత్ బస్సుల కేటాయింపులపై పాలకులు సరైన రీతిలో స్పందించకపోతే? రెండోసారి మొండిచేయి తప్పదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రైళ్లు రాకపోకల ప్రభావం..

ఇదిలా ఉండగా ఏలూరు కేంద్రంగా రాత్రి 7.30 గంటలు దాటాక వివిధ ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివిధ ప్రాంతాలకు ఒకటో, రెండో తిరుగుతుండడం వల్ల ప్రయాణికులు బస్సులనే ఆశ్రయిస్తున్నారు. తిరుమల, కాకినాడ టౌన్, మెయిల్ ఇతర రైళ్ల ఆలస్యం అయితే అతి కష్టం మీద ఇవి ఎక్కడానికి 8 గంటలకు దాటాక కుదురుతోంది. లేకపోతే విజయవాడ, విశాఖ వైపు ప్రయాణాలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లా కేంద్రం నుంచి అటు విజయవాడ, ఇటు రాజమండ్రి వరకు డెమో రైళ్లు ఎప్పుడు నడపుతారో? తెలియక పెద్ద సమస్యగా ఉంది.

మూడు డిపోలు.. 225 బస్సులు

ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు బస్సు డిపోల పరిధిలో ఆర్టీసీకి చెందినవి కేవలం 225 బస్సులే ఉన్నాయి. అద్దె బస్సులు 84 ఉన్నాయి. ఉన్న అరకొర బస్సులతో జిల్లా ప్రజలు తంటాలు పడుతున్నారు. ప్రధానంగా గుడివాడ, హనుమాన్‌జంక్షన్,మచిలీపట్నం, భీమవరం,తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాలకు ఏలూరు కేంద్రం నుంచి రాత్రి 8 గంటలు దాటితే బస్సులు తిరగడం అతి తక్కువ. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ ఆయా ప్రాంతాలకు చేరుకుంటున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో కూర్చోవడానికి సరైన సౌకర్యాలు లేక ఇక్కట్లు పడుతున్నారు.



టీచర్ ఆత్మహత్యపై అనుమానాలెన్నో..


- పొంతనలేని సమాధానాలు చెప్పిన భర్త
- అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు

■ లోపలి పేజీలో..

బీజేపీ జిల్లా కార్యవర్గంలో చోటు

- ఏడుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు జనరల్ సెక్రటరీలు నియామకం

ఏలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు కల్పిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ కిశోర్ నియామక ఉత్తర్వులను సోమవారం ఇచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులుగా నెరుసు నెల రాజు (ఏలూరు), బోను అప్పారావు (నూజివీడు), పీసుపాటి రామలక్ష్మి (చింతలపూడి), శిర్రాజు వసుంధరాదేవి(నూజివీడు), వేమూరి శ్రీనివాస్ (చింతలపూడి), గుమ్మడి వి.కృష్ణ చైతన్య(దెందులూరు), సమయం ఏసుబాబు (కైకలూరు) నియమితులయ్యారు. జిల్లా జనరల్ సెక్రటరీలుగా నగరపాటి వి.సత్యనారాయణ (ఉంగుటూరు), గాది రాంబాబు (ఏలూరు), వీరావరపు దుర్గా నివాస్ (పోలవరం) నియమితులయ్యారు. వీరితో పాటు ఏడుగురు జిల్లా కార్యదర్శులు, ట్రెజరర్, జిల్లా ఐటి కన్వీనర్‌తో పాటు 37 మంది ఈసీ సభ్యులను నియమించారు.



జిల్లా జనరల్ సెక్రటరీలుగా నియమితులైన సత్యనారాయణ,రాంబాబు, దుర్గా నివాస్

పంటచేలపై డ్రోన్‌లు



పురుగుమందుల పిచికారీకి వినియోగం

80 శాతం సబ్సిడీపై అందజేత

రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం

లింగపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ పెరుగుతున్నకొద్దీ ప్రతి రంగంలోనూ సాంకేతిక పరిజ్ఞానం వాడుతున్నారు. రైతులు కూడా వ్యవసాయరంగంలో ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ప్రస్తుతం యుద్ధభూమి నుంచి వ్యవసాయం దాకా డ్రోన్‌ల వినియోగం భాగంగా పెరిగింది. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని రైతులు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవడంతో పనులు సులువుగా చేసుకుంటున్నారు. ఒకప్పుడు రైతులు పంట చేలల్లో పురుగు మందులు పిచికారీ చెయ్యాలంటే వ్యవసాయ కూలీలపై ఆధారపడాల్సి వచ్చేది. రైతులకు వ్యవసాయ కూలీలకు అధిక ఖర్చులతో పాటు పురుగుమందుల పిచికారీ చేసే సమయంలో ప్రమాదాల భారిన పడిన సంఘటనలు ఉన్నాయి. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించి రైతులకు ఉపాధి కల్పించి వారికి ఆదాయం సమకూర్చేలా వ్యవసాయశాఖ ద్వారా రైతులకు 9 లక్షల ఎనభైవేల రూపాయల విలువైన డ్రోన్‌లను ఎనభైశాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ డ్రోన్‌లతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పురుగు మందుల పిచికారీ చేసేందుకు వీలుండటం, వ్యవసాయ కూలీల ఖర్చు తగ్గుతుండటంతో పాటు ఆదాయం కూడా లభిస్తుండటంతో కొందరు రైతులు వీటిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నిరుద్యోగ యువతకు అవకాశం

సబ్సిడీపై డ్రోన్‌లను పొందేందుకు గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువత స్థానిక రైతులతో కలసి ఐదుగురు సభ్యులుగా గ్రూపులను ఏర్పాటు చేసి వివరాలను అధికారులకు అందిస్తే వారికి 12 రోజుల పాటు డ్రోన్‌ల వినియోగంపై ఉచితంగా శిక్షణ ఇస్తారు. అనంతరం వారికి సర్టిఫికెట్‌లను కూడా అందిస్తారు. రైతులు ముందుగా రూ.9.80 లక్షలను చెల్లించి డ్రోన్‌లను కొనుగోలు చెయ్యాలి. రైతులకు డ్రోన్‌లను అందించిన తరువాత రైతుల వాటా పోను మిగిలిన సబ్సిడీ రూ.7.80 లక్షలు రైతులకు చెందిన గ్రూపు ఖాతాలలో జమ చేస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఇప్పటి వరకు 20 డ్రోన్లు అందించాం



రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా అవగాహన కల్పిస్తున్నాం. ఏలూరు జిల్లాలో రైతుల నుంచి ఇప్పటి వరకూ నలభై డ్రోన్‌లకు అర్జీలు అందాయి. వాటిలో ఇరవై డ్రోన్‌లను రైతులకు అందించాం. మిగిలినవి త్వరలోనే అందిస్తాం. రైతులు తమ పంటలకు తరచూ పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో సమయం, డబ్బుతో పాటు కూలీల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రోన్‌ల వల్ల రైతులకు సమయం, ఆదాయం రెండూ కలిసి వస్తాయి. తమ పంట పొలాలలోనే కాకుండా ఇతర రైతులకు అద్దెకు ఇచ్చి ఆదాయాన్ని పొందవచ్చు.

హబీబ్ భాషా, జిల్లా వ్యవసాయాధికారి, ఏలూరు జిల్లా

వ్యర్థానికీ అర్థం



వర్మీ కంపోస్టు కోసం తీసుకువచ్చిన గుర్రపుడెక్క

గుర్రపుడెక్కతో వర్మీ కంపోస్టు తయారీ

సిద్ధాపురంలో పైలట్ ప్రాజెక్టు

అధిక మోతాదులో నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం, కాల్షియం

ప్రధానంగా ఆక్వా చెరువులకు ఉపయోగం

డ్వాక్రా గ్రూపులకు ఉపాధి

మార్కెటింగ్‌కు సహకారం : కలెక్టర్ నాగరాణి

ఆకివీడు రూరల్ జూలై 21 (ఆంధ్రజ్యోతి): గుర్రపుడెక్కతో కంపోస్టు ఎరువు తయారీ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైంది. ఆకివీడు మండలం సిద్ధాపురం గ్రామంలో కాలువల్లో నీటి ప్రవాహానికి ప్రతిబంధకంగా ఉండే గుర్రపుడెక్క నుంచి కంపోస్టు తయారీ ప్రాజెక్టును ప్రారంభించారు. కాలువల్లో పేరుకుపోయి, ప్రవాహానికి అడ్డంకిగా మారి నీరందక పంటలను నాశనం చేస్తూ రైతులను కన్నీరుపాలు చేస్తున్న గుర్రపుడెక్క ఇప్పుడు ప్రయోజనకారిగా మారింది. ఏటా రైతులకు ఇటు అధికారులకు తలనొప్పులు తీసుకువస్తున్న గుర్రపుడెక్కను ఏవిధంగా ఉపయోగించుకోవాలో పరిశోధించిన వ్యవసాయ శాఖాధికారులు సూచనల మేరకు గుర్రపుడెక్కతో కంపోస్టు ఎరువు తయారీకి నడుం కట్టారు. డ్వాక్రా సంఘాలు, ఉపాధిహామీ కార్మికులు సహాయంతో కాలువల్లోని గుర్రపుడెక్కను తీసుకొచ్చి చాప్ కట్టర్‌తో చిన్న చిన్న ముక్కలుగా చేసి పశువులు పేడ, బెల్లం కలిపి కంపోస్టు తయారీ చేపట్టారు. ఆరు ట్రాక్టర్ల పశువులు పేడ, గుర్రపుడెక్క, బెల్లంతో సుమారు 3 నెలల వ్యవధిలో సుమారు 10 టన్నుల వర్మీ కంపోస్టు తయారైంది. ప్రాజెక్టు ప్రారంభంలో గుర్రపుడెక్క ముక్కలు చెయ్యడానికి చాప్ కటర్, సంచులు కొనుగోలుకు, సంచులు కుట్టేందుకు ఉపయోగించే మిషన్ వంటివి పరికరాలు కొనుగోలు చెయ్యడానికి, ఇతర ఖర్చులకు పెట్టుబడి రూ.82 వేలు అయ్యింది. కిలో 12 రూపాయలు చొప్పున పది టన్నులకు రూ.లక్షా 20 వేలు వస్తున్నది. సుమారు 38 వేలు లాభంగా ఉంటుందని అంచనా వేశారు. లాభంతో పాటు ఇద్దరికి జీతభత్యాలు సైతం లభించాయి. ఈ వర్మీ కంపోస్టులో కాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, నైట్రోజన్‌లు అధిక మోతాదులో ఉన్నాయని పరీక్షలలో తేలింది. వ్యవసాయం, హార్టీ కల్చర్‌తో పాటు ఆక్వా రంగంలో ఇది ఎక్కువగా ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

మార్కెటింగ్‌కు సహకరిస్తాం

ఉత్పత్తి అయిన వర్మీ కంపోస్టును హార్టీ కల్చర్, వ్యవసాయం, ఆక్వా రంగాలలో వినియోగించేందుకు జిల్లా కలెక్టర్ నాగరాణి అంగీకారం తెలియజేశారు. ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించి డ్వాక్రా మహిళలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారి విన్నపం మేరకు మార్కెటింగ్‌కు సహకారమందిస్తామని తెలిపారు. జిల్లాలో మిగిలిన ప్రాంతాల్లో కూడా ఈ విధంగా వర్మీ కంపోస్టు తయారీకి సిద్ధం చెయ్యాలని అధికారులను ఆదేశించారు.



చాప్ కట్టర్‌తో ముక్కలుగా చేసిన గుర్రపుడెక్క.... పశువులు పేడతో కలిపి తొట్టెలలో వేసిన దృశ్యం ..ప్రాజెక్టులో తయారైన వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి (ఫైల్)

రెండు రకాలు ఉపయోగం

గుర్రపుడెక్కతో వర్మీకంపోస్టు తయారు చెయ్యడం వలన రెండు రకాలు ఉపయోగాలున్నాయి. ప్రధానంగా కాలువలలో పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుపడి, సాగు, తాగునీటికి ఇబ్బందులు కలిగించే గుర్రపుడెక్క సమస్యకు పరిష్కారం లభించినట్టే, దీనివల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఏటా కోట్లాది రూపాయలు ఆదా కానున్నాయి. దీనితో తయారయ్యే వర్మీకంపోస్టు వల్ల డ్వాక్రా మహిళలకు ఉపాధితో పాటు లాభాలు వస్తాయి.

• రెండో విడత నుంచి లాభాలు పెరుగుతాయి



ప్రాజెక్టు ప్రారంభంలో ఖర్చులు వల్ల లాభాలు తక్కువగా ఉన్నాయి. గుర్రపుడెక్క సేకరణ, పశువులు పేడ, కూలీలకు ఖర్చు అవుతుంది. మొదటిసారి గుర్రపుడెక్క ముక్కలు చేసేందుకు చాప్ కటర్, సంచులు కుట్టేందుకు చేతి మిషన్, ఇతర పరికరాలు కొనుగోలుకు అదనంగా ఖర్చు అయ్యింది. రెండోసారి ఇవేమి ఉండవు. అయితే ప్రభుత్వం మార్కెటింగ్ చేస్తే ఉత్పత్తి చేసిన వర్మి కంపోస్టుకు ఆదాయం లభిస్తుంది. లాభాలతో పాటు ఇద్దరికి జీతాలు లభించడంతో జీవనోపాధి పెరుగుతుంది. రైతులు కూడా గుర్రపుడెక్కను కాలువల నుంచి సేకరించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా చెరువులు యజమానులు వర్మీ కంపోస్టు కోసం సంప్రదిస్తున్నారు.

సుధ, డ్వాక్రా మహిళ, ప్రాజెక్టు సభ్యురాలు



ఐలా వలతో చేపలు వేటాడుతున్న మత్స్యకారులు ..వలలో పడ్డ చేప పిల్లలు

నిషేధిత వలలతో చేపల వేట

ప్రాజెక్టు ఎగువున ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వేట

స్థానిక మత్స్యకారుల్లో ఆందోళన

పోలవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పోలవరం వద్ద గోదావరిలో నిషేధిత ఐలా వలలు (అప్పుడే పుట్టిన చేప పిల్లలను సైతం పట్టే చిన్న రంధ్రాలు కలిగిన వల)తో చేపలను ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మత్స్యకారులు వారం రోజులుగా అక్రమంగా పట్టి ఇతర ప్రాంతాలకు లారీలతో భారీ స్థాయిలో రవాణా చేస్తున్నారు. దీని వల్ల మత్స్య సంపద తగ్గి తమ ఉపాధి కోల్పోతున్నామని మత్స్యశాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం మండలంలో సుమారు 200 మంది మత్స్యకారులు చేపలు వేటాడి జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రాజెక్టు ఎగువన పాపికొండల అభయారణ్యం పరిధి కావడంతో అక్కడ చేపల వేట చేయకూడదని అటవీశాఖ అధికారులు ఆంక్షలు విధించిన నేపథ్యంలో ప్రాజెక్టు ఎగువున చేపల వేట నిలిపివేశారు. అదే అవకాశంగా భావించిన ఇతర ప్రాంతాల మత్స్యకారులు ఏడాది కాలంగా స్థానిక వైసీపీ మండల స్థాయి నాయకుడి భాగస్వామ్యంతో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పోశమ్మ గండి ప్రాంతంలో నిషేధిత వలలతో అక్రమ వేట కొనసాగిస్తూ పట్టిన చేప పిల్లలను ఎండబెట్టి పొడుం చేసి ముంబై లాంటి పట్టణాలకు రవాణా చేస్తున్నారు. ఈ విషయాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో అటవీశాఖ, మత్స్యశాఖ అధికారులు అక్రమ చేపల వేట చేస్తున్న మత్స్యకారులను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. మూడు నెలల క్రితం మత్స్యశాఖ అధికారులు గోదావరిలో మత్స్య సంపద అభివృద్ధి కోసం లక్షలాది చేపపిల్లలను గోదావరిలో వదిలారు. నెల రోజులుగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మత్స్యకారులు నిషేధిత వలలతో చేపపిల్లలతో సహా పట్టి పురుషోత్తపట్నం నుంచి ఎగుమతి చేస్తున్నారు. పచ్చి చేప పిల్లలకు భారీ ధర పలుకుతుండడంతో ఎన్ని ఆంక్షలు విధించినా అక్రమార్కులు వేట కొనసాగిస్తూనే ఉన్నారు. అడ్డుకున్న స్థానిక మత్స్యకారులపై దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు నిషేధిత వలల వేటకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఈ విషయంపై మత్స్యశాఖ సహాయ అధికారి కె.మంగారావుని వివరణ కోరగా నిషేధిత వలలతో వేటాడే వారికి నోటీసులు ఇచ్చామని వలలు, బోట్లు పక్కన పెట్టించామని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పశువులకు సీజనల్ వ్యాధులు

రైతులు టీకాలు వేయించాలి



ఏలూరు టూటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వాతావరణ పరిస్థితులను బట్టి మనుషులు అనారోగ్యాల పాలైనట్లు పశువులు కూడా రోగాల బారినపడుతుంటాయి. అధిక వర్షాల కారణంగా గోతుల్లో నిలిచిన మురుగు నీరు తాగటం వల్ల రోగాల బారినపడుతుంటాయి. పశువులు నివాసం ఉండే పాకలు పరిశుభ్రంగా లేకపోవడం మరో కారణం. వర్షాలకు దోమలు ప్రబలి పశువులను కుట్టడం వల్ల అనారోగ్యం పాలవుతాయి. అనారోగ్యం పాలైన తరువాత ఆసుపత్రులకు పరిగెత్తటం కంటే జబ్బు ముందస్తుగా టీకాలు వేయించుకుంటే పశువులు తొందరగా అనారోగ్యం పాలవ కుండా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రతీ పశువుకు మూడు నెలల తరువాత తప్పనిసరిగా టీకాలు వేయించాలి. చాలామంది పశుపోషకుల్లో టీకాలు వేయిస్తే పశువులు సరిగా పాలివ్వవని, చూడి పశువులు ఈసుకుపోతా యనే అపోహలున్నాయి. ఈ అపోహల్లో ఎటువంటి వాస్తవం లేదని పశు వైద్యాధికారులు తెలుపుతున్నారు. టీకాలు వేయిస్తేనే పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. ముఖ్యంగా వర్షాకాలంలో పశువులకు గాలికుంటువ్యాధి, దొమ్మవ్యాధి, గొంతువాపు వ్యాధి, జబ్బువాపు వ్యాధి సోకుతుంటాయి. గొంతువాపువ్యాధి, జబ్బు వాపువ్యాధికి మే, జూన్, జూలై నెలలో వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. గాలి కుంటు వ్యాధికి, దొమ్మవ్యాధికి ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పశువుల ఆసుపత్రిల్లో టీకాలు వేస్తారు. ఈ రోజుల్లో పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పటికి తప్పనిసరిగా టీకాలు వేయించుకుంటే మంచిది. పశువులకు ఎలాంటి అనారోగ్యం లేదని కొంతమంది రైతులు టీకాలు వేయించుకోరు. ఇది చాలా ప్రమాదకరం. తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలి.

రైతు సేవాకేంద్రాల్లో వ్యాక్సిన్లు ..

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 11 వెటర్నరీ ఆసుపత్రులు, 66 డిస్పెన్సరీలు, 57 గ్రామీణ లైవ్‌స్టాక్ యూనిట్లు, 315 రైతు సేవా కేంద్రాల్లో ఎక్కడైనా వ్యాక్సిన్లు వేయించుకోవచ్చు. పశువులకు వ్యాధిసోకితే వెంటనే పశు వైద్యాధికారులు సూచనల మేరకు మందులు వాడాలి. సొంతంగా మందులు వాడితే పశువులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. జిల్లాలో లక్షా 35 వేల 607, నల్లజాతి పశువులు 5,06,000, గొర్రెలు 5,26,000, మేకలు 2లక్షలు, పందులు 7600 ఉన్నాయి. గొంతు వాపు లేక దొమ్మవ్యాధి సోకిన జీవాలకు 106 డిగ్రీల కంటే ఎక్కువ జ్వరం ఉంటుంది. మేత మేత మేయవు, ముక్కునుంచి చిక్కటి నురగ కారుతూ శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. కళ్లు ఎర్రబడి నీరుకారుతుంటాయి. గాలికుంటు వ్యాధిసోకిన జీవాలకు 105 డిగ్రీల కంటే ఎక్కువ జ్వరం ఉండి ముడుచుకుని పడుకుంటాయి. నోరు, నాలుకపై భాగంలో పుళ్లుంటాయి. మేత, నెమరవేయవు. పాలు తగ్గిపోవడమే కాకుండా కళ్ల నుంచి నీరు, నోటి నుంచి సొంగ కారుతుంటాయి.

• ముందస్తుగా టీకాలు వేయించండి



పశువులకు వ్యాధి సోకకముందే టీకాలు వేయించుకోవాలి. ముందుగా వానాకాలంలో వచ్చే వ్యాధుల గురించి తెలుసుకోవాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే పశు వైద్యాధికారిని సంప్రదించాలి. పశువులు ఉండే పాకల్లో గాలి, వెలుతురు, బాగా ఉండేలా చూసుకోవాలి. పశువుల పాకలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పశువుల్లో మురుగునీరు తాగనివ్వకూడదు. తొట్టెలు ఏర్పాటు చేసి పరిశుభ్రమైన నీరందించాలి. తడిచిన, పాడైన ఆహారం ఇవ్వరాదు.

-డాక్టర్ గోవిందరాజు, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్థక శాఖ

మలేరియా.. మందుల్లేవ్!

ఏజెన్సీలోని పీహెచ్‌సీలకు నిలిచిన మలేరియా మందుల సరఫరా

సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులకే పరిమితం

ఇబ్బందులు పడుతున్న గిరిజనం



బుట్టాయగూడెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీవాసులను పీడిస్తూ ప్రాణాలు తీసే మలేరియా నివారణకు ఉపయోగించే యాంటీ మలేరియా డ్రగ్స్ (మలేరియా నివారణ మందులు) ఏజెన్సీ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)కు మందుల సరఫరా నిలిచిపోయింది. దీంతో మలేరియా మందులు కావాలంటే మారుమూల ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు, పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీలకు నిలిపివేసిన ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, ఏరియా ఆసుపత్రులకు సరఫరా చేస్తోంది. సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీలు) పోలవరం నియోజకవర్గంలోని ఏడు ఏజెన్సీ మండలాలు ఉండగా బుట్టాయగూడెం, పోలవరం మండల కేంద్రాల్లో మాత్రమే సీహెచ్‌సీలు ఉండగా జంగారెడ్డిగూడెంలో ఏరియా ఆసుపత్రి ఉంది. ఇకనుంచి అక్కడ మాత్రమే మలేరియా నివారణ మందులు అందుబాటులో ఉంటాయి. ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి మండలాల్లో మలేరియా బారినపడినవారు బుట్టాయగూడెం, పోలవరం లేదా జంగారెడ్డిగూడెం రావాల్సి ఉంటుంది. గతంలో ఏజెన్సీలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నివారణ మందులు అందుబాటులో ఉండేవి. గ్రామాల్లో పర్యటించే వైద్య ఆరోగ్య శాఖల సిబ్బంది దగ్గర మందులు లేకుంటే పీహెచ్‌సీలకు వెళ్లి బాధితులు తెచ్చుకునే వారు. మందులు నిలుపుదలతో ప్రస్తుతం అటువంటి పరిస్థితులు లేవు.

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని కేఆర్ పురం ఐటీడీఏలో 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 85 సబ్‌సెంటర్లు పనిచేస్తున్నాయి. మలేరియా నివారణకు మందులు ఏజెన్సీలోని పీహెచ్‌సీల్లో అందుబాటులో లేకుంటే బాధితులకు మరిన్ని ఇబ్బందులు తప్పవని ప్రజాసంఘాల నాయకులు కారం రాఘవ, పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. పీహెచ్‌సీలకు మలేరియా నివారణ మందులు నిలిచిపోయి ఏడాది గడుస్తున్నా విషయం బయటకు రాకపోవడం విచారకరమన్నారు. మలేరియా నివారణ మందులను పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచాలన్నారు.

మలేరియా నివారణ మందులు సరఫరా ఏజెన్సీలోని పీహెచ్‌సీలకు నిలిచిపోయిన విషయంపై 'ఆంధ్రజ్యోతి' డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు జె.సురేష్‌కుమార్‌ను వివరణ కోరగా వాస్తవమేనని నిర్ధారించారు. సీహెచ్‌సీలకు, ఏరియా ఆసుపత్రులకు సరఫరా చేస్తున్నారని, మలేరియా బారిన పడినవారికి సిబ్బంది నివారణ కిట్లను అందజేస్తారని ఇబ్బందులు ఉండవన్నారు.

తాగునీరు ఇలా ఉంటే తాగేదెలా ?



బురద నీటితో రోగాలు

సింగవరం గ్రామస్థుల అవస్థలు

దెందులూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సురక్షితమైన తాగునీరు అందించి తమను రోగాల నుంచి రక్షించాలని కొత్తగూడెం శివారు సింగగూడెం గ్రామస్థులు కోరుతున్నారు. దెందులూరు మండలంలోని సీతంపేట పంచాయతీ పరిధిలోని సింగవరం ప్రాంతంలో సుమారు వెయ్యి మంది వరకు నివాసం ఉంటున్నారు. తాగునీటికి గోదావరి కాల్వ నీటిని సరఫరా చేయాల్సి ఉంది. కానీ పంచాయతీకి నిధులు లేకపోవడంతో పాటు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో గోదావరి నీరు సరిగా ఫిల్టర్ కాకపోవడంతో బురద నీరే సరఫరా అవుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. తమకు సురక్షితమైన తాగునీరు అందించాలని సింగవరం ప్రాంతవాసులు కోరుతున్నారు.

గుండుగొలను నుంచి అందిస్తున్నాం..

తాగునీటి కలుషితంపై తాగునీటి సరఫరా విభాగం అధికారి చింతమనేని వర్మను వివరణ కోరగా గ్రామస్థులు బురద నీరు వస్తున్నాయని ఫిర్యాదు చేస్తున్నారని పైప్‌లైన్ సమస్యలతో పాటు క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్నాయని అన్నారు. గుండుగొలను సురక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రస్తుతానికి నీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

• సురక్షితమైన నీటిని అందించాలి



ఎన్నో రోజులుగా తాగునీరు ఎర్రగానే వస్తున్నది. ఒంటరి వృద్ధురాలిని.. రెండు కిలోమీటర్లు వెళ్లి నీరు తెచ్చుకోలేక పంపుల ద్వారా ఇంటికి వచ్చే బురద నీటినే కొంత కాలంగా తాగుతున్నాను. పంచాయతీ అధికా రులు, ప్రభుత్వం స్పందించి మంచి తాగునీటిని సరఫరా చేయించాలి

దుర్గాసి టవుటమ్మ, సింగవరం

• వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయండి



గోదావరి కాల్వ నుంచి వస్తున్న నీటిని సక్రమంగా ఫిల్టర్ చేయక పోవడం వల్ల గ్రామస్థులు రాగాలబారిన పడుతున్నాం. ప్రభుత్వం గ్రామస్తులకు వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి తాగునీటిని అందించాలి

పదర్లపాక సావిత్రి, సింగవరం

• గుక్కెడు నీటికోసం పాట్లు



ప్రభుత్వాలు మారిన మా తలరాతలు మారలేదు. గుక్కెడు తాగునీటి కోసం అల్లాడిపోతున్నాం. కూటమి ప్రభుత్వం సింగవరం గ్రామస్తుల తాగునీటి సమస్యను పరిష్కరించాలి. తాగునీటిని ఫిల్టర్ చేసి సురక్షితమైన తాగునీటిని రెండు పూటలా అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

పొలిమేర నాగమణి, సింగవరం

మురుగు కాలువలో పైప్‌లైన్

నీరు దుర్వాసన వస్తోందంటున్న ప్రజలు..

పట్టించుకోని అధికారులు

ఏలూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడికక్కడ డయేరియా కేసులు వెలుగు చూస్తున్నాయి. నీటి కాలుష్యం కారణంగా అతిసార కేసులు నమోదవుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంటుంది. అటువంటి ఇబ్బంది రాకుండా మే, జూన్ నెలల్లోనే అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ అలా చేయలేదు. నీటి కాలుష్యానికి ప్రధాన కారణమైన డ్రైనేజీలోని పైప్‌లైన్‌లను సురక్షిత ప్రాంతానికి మార్చడానికి మాత్రం విస్మరిస్తున్నారు.ఏలూరులో శనివారంపేట హైస్కూల్ రోడ్డుకు వెళ్లే ప్రాంతంలో మంచినీటి పైప్‌లైన్ మురుగు డ్రైన్‌ను అనుకొని ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం డ్రెయిన్లో మురుగునీరు తొలగించే క్రమంలో పైపులైన్ ధ్వంసం అయ్యింది. ఇది జరిగి వారం రోజులు కావస్తున్న పట్టించుకునే నాధుడే కరవయ్యాడు. పైప్‌లైన్ ద్వారా మంచినీరు వృధాగా పోవడమే కాకుండా కుళాయి పైప్‌లైన్‌లోకి మురుగునీరు చేరి ఆ కలుషిత నీరే స్థానిక ప్రజలు తాగునీటిగా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారపు పేటలో మురుగుకాలువలో ఇలా తాగునీటి పైప్‌లైన్లు ఉన్నాయి. పైపు పగిలి ఉండటంతో మురుగునీరు పైపులోకి చేరి నివాసాలకు సరఫరా అవుతోంది. ఆ నీటినే ఆయా ప్రాంతాలలో చాలా మంది తాగుతున్నారు. తరచూ ఈ ప్రాంతంలో నీరు రంగుమారి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచి నీరు పేరిట సరఫరా చేస్తోన్న జలాలు రంగుమారి, నలకలతో నిండి, దుర్వాసన వస్తున్నాయి. వెళుతున్న మంచినీటి పైపులు, అడుగడుగునా లీకేజీలు, దుర్వాసనతో కూడిన నీరే శరణ్యమైన దయనీయ దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టకపోతే పరిస్థితి మరింతగా చేయి దాటే ప్రమాదం ఉందని జనం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరు శనివారపు పేట సమీపంలో డ్రెయినేజీ నీటిలో పగిలిన తాగునీటి పైప్ లైన్

నిఘా డొల్లే..

- ఆగని చికెన్ వ్యర్థాల సరఫరా
- కొల్లేరు, పరిసర గ్రామాలను కబళిస్తున్న కాలుష్యం
- నిద్రావస్థలో పలు శాఖల అధికారులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న చికెన్ వ్యర్థాల వాహనాలు

పెదపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణల్లోని ముఖ్య పట్టణాల నుంచి వేలు, లక్షల కిలోల చికెన్ వేస్ట్‌ను సేకరించి, ప్రతిరోజూ వాటిని లారీల్లో నింపి ఒక్క కొల్లేరు పరిసర ప్రాంతాల్లో ఉన్న చేపల చెరువుల్లో మేతగా వేస్తుంటే నీరు, గాలి, పర్యావరణ కాలుష్యం ఎంతటి తీవ్రస్థాయిలో ఉంటుందో ఊహిస్తేనే భయంగా ఉంది. చికెన్ వేస్ట్ రవాణాను ఆపేందుకు వివిధ స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగాలు ఉన్నా అవన్నీ నిద్రావస్థలో ఉన్నాయని, అందువల్లే వందల కిలో మీటర్ల దూరం ప్రయాణించి వాహనాలు ఇక్కడ వరకూ చేరుకుంటున్నాయనే విమర్శలు లేకపోలేదు. వాహన తనిఖీల్లో పోలీసులకు పట్టుబడుతున్నా.. ఏ మాత్రం తగ్గేదెలే అన్నట్లుగా వాహనాలు ఈ ప్రాంతానికి చికెన్ వేస్ట్‌తో క్యూ కడుతూనే ఉన్నాయి. రవాణా ఇలానే కొనసాగితే ఈ ప్రాంతాల్లో తీవ్ర అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

వేల కిలోల చికెన్ వేస్ట్ పూడ్చిపెట్టడం ఒక సవాల్

ప్రతిరోజూ వేల కిలోల్లో చికెన్ వేస్ట్ పట్టుబడుతుండటంతో వాటిని పూడ్చి పెట్టడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది. తీవ్ర దుర్వాసన వెదజల్లే వేస్ట్‌ను పూడ్చి పెట్టాలంటే గ్రామాలకు దూరంగా ఖాళీ ప్రదేశాలు కావాలి. ఈ ప్రాంతమంతా ఒకపక్క చేపల చెరువులు, మరో పక్క పంటపొలాలు, ఆవాసాలు ఉండటంతో ఏ ప్రాంతంలో వీటిని పూడ్చడానికి ప్రయత్నిస్తే అక్కడ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోందని పోలీసు సిబ్బంది వాపోతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న కార్యకలాపాలపై ప్రభుత్వ యంత్రాంగం దాడు లు చేసి, కేసులు నమోదు చేస్తుంటే ఆ కార్యకలాపాలు నెమ్మదిగా మందగిస్తాయి. కానీ ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా తగ్గేదేలే అన్నట్లు ప్రతిరోజూ చికెన్ వ్యర్థాలతో కూడిన వాహనాలు మండలంలోని పలు గ్రామాలకు తరలి వస్తున్నాయి. కాగా ఆ వ్యర్థాల దుర్వాసనతో గ్రామస్థులు అల్లాడుతున్నారు. అంటు రోగాల బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వ్యర్థాలు పట్టుబడినప్పుడల్లా పోలీసులు వాటిని భూమిలో పూడ్చిపెడుతున్నారు. అయినా రవాణా ఆగడం లేదు.

కేసుల నమోదు

సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో చికెన్ వేస్ట్‌ను తరలిస్తున్న బొలోరో, ఐషర్ వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. ఆయా వాహనాల యాజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసి, చికెన్ వేస్ట్‌ను గ్రామాల బయట పూడ్చి పెట్టించినట్లుగా తెలిపారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రావులపర్రు-రాచూరు కాలువ పూడిక తీయించాలి

ఏలూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి):ఉంగుటూరు మండలం రావులపర్రులో సుమారు 150 ఎకరాల్లో వరి నారుమళ్లు నీట మునిగి కుళ్లిపోతున్నాయని, రావులపర్రు-రాచూరు మధ్య కాలువ పూడిక తీయించాలని కోరుతూ రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి కలెక్టర్ వెట్రిసెల్వికి కలిసి వినతిపత్రం అందజేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు మురుగుకాలువ నుంచి కొల్లేరులో కలుస్తుందని, రావులపర్రు రెగ్యులేటర్ వద్ద ఈ కాలువ చెక్క బల్లలు కిందకు దించడంతో నీరు దిగువకు వెళ్లక నారుమడులు మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేపలు, రొయ్యల చెరువులకు నీరు అధికంగా వదలడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని తమకు న్యాయం చేయాలని బయ్యవరపు శ్రీను, ఎడవల్లి శ్రీను, నల్లి హరికృష్ణ, తాడిశెట్టి రాజకుమార్ కోరారు.

అక్రమ విదేశీ క్రిప్టో కరెన్సీ ప్లాట్‌ఫామ్స్‌పై చర్యలు

పార్లమెంట్‌లో ఎంపీ మహేశ్ ప్రశ్నకు మంత్రి సమాధానం



ఏలూరు టూ టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి):అక్రమ విదేశీ క్రిప్టో కరెన్సీ ప్లాట్‌ఫామ్స్‌పై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీ మహేశ్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్‌లో ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి పంకజ్‌చౌదరి సమాధానం ఇచ్చారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఫైనాన్షియల్ ఇంటిలిజెంట్ యూనిట్ వర్చువల్ అసెట్ సర్వీస్ ప్రొవైడర్ల వివరాలను కేంద్రం నమోదు చేస్తుందని నిబంధనలు అతిక్రమించిన వారిపై కేంద్రం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి బదులిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వేదికలను గుర్తించి చర్యలు తీసుకుంటామని మంత్రి సమాధానం ఇచ్చారు.


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు క్రీడాకారుల ప్రతిభ

ఏలూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా జాయింట్ కలెక్టరు ధాత్రిరెడ్డి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి విద్యతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. ఈనెల 19, 20వ తేదీల్లో జరిగిన 10వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఏలూరు జిల్లా నుంచి 20 మంది పాల్గొనగా అందులో ఏలూరు క్రీడా ప్రాధికార సంస్థ స్విమ్మింగ్ పూల్ నుంచి ఆరుగురు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. బలగ స్వామినాయుడు ఐదు బంగారు పతకాలు సాధించి వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ సాధించారు. ధనుష్ సాయి 2 బంగారు, 2 రజిత, కాంస్య పతకం సాధించారు. యశ్వసిని 2 బంగారు పతకాలు సాధించారు. ఉన్నమట్ల మోహనదీప్తి 2 కాంస్య పతకాలు, అడ్డాడ రిశ్వంత్ కాంస్య పతకం, షేక్ హకీల్ కాంస్య పతం సాధించారు. జాతీయ జూనియర్ వాటర్ పోలో గేమ్‌కు అడ్డాడ రిశ్వంత్, షేక్ హకీల్ ఎంపికయ్యారు. జిల్లా ఇన్‌చార్జి క్రీడల అధికారి శేఖర్, కోచ్ బలగ గణేష్, తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నాయకులు

పశ్చిమ గోదావరి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి):వెస్ట్ గోదావరి బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను సోమవారం భీమవరంలో జరిగిన కమిటీ సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా కలిదిండి వినోద్ వర్మ, జిల్లా అధ్యక్షుడుగా కఠారి రవి శంకర్, కార్యదర్శిగా వలవల ఫణి కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా వాడపల్లి శ్రీనివాస్ రాజులను ఎన్నుకున్నారు. వారితో పాటు కన్వీనర్ కొప్పురావూరి షణ్ముక్ కుమార్, ట్రెజరర్ మద్దు వాసు, జాయింట్ సెక్రటరీ ముత్యాల గణపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కేతల ప్రకాష్, జడ్జిస్ కమిటీ చైర్మన్ పత్తి సురేష్, కమిటీ ప్రెసిడెంట్ సంగవరపు గోవర్ధన్ కుమార్, కార్యదర్శి రెడ్డి రవిరాజా, కాంపిటీషన్ సెక్రటరీ గవర అనిల్, కో-ఆర్డినేటర్ కమిటీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, ఈసీ మెంబర్లుగా మరం రాధాకృష్ణ, యాడ్ల ఉపేంద్ర, ఆకుల సురేష్‌లను ఎన్నుకున్నారు.


గోల్డ్ మెడల్ సాధించిన ఉషశ్రీ

యోగా పోటీల్లో తాడేపల్లిగూడెం క్రీడాకారుల ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి):భారత ప్రభుత్వ క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భీమవరంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తాడేపల్లిగూడెం క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పట్టణానికి చెందిన యర్రంశెట్టి ఉషశ్రీ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. తాడేపల్లిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కొండపల్లి శిరీష ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. విద్యార్థిని హెచ్‌ఎం సత్యనారాయణ అభినందించారు. మోదుగగుంట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నరమామిడి భాస్కర వెంకట రాజేష్ ద్వితీయ స్థానం సాధించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, పీడీ చంద్రశేఖర్‌లు అభినందించారు.

షార్ట్ ఫిలిం పోటీల్లో వంశీ కృష్ణం రాజుకు ఉత్తమ దర్శకుడి అవార్డు



కాళ్ళ, జూలై 21(ఆంధ్రజ్యోతి):షార్ట్ ఫిల్మ్ పోటీల్లో ఉత్తమ డైరెక్టర్ అవార్డును కాళ్ల మండలం కోపల్లెకు చెందిన ఇందుకూరి వంశీకృష్ణంరాజు దక్కించుకున్నాడు. ఈనెల 20వ తేదీన కోల్‌కతాలో జరిగిన 14వ అంతర్జాతీయ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు అందుకున్నట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు వెయ్యి మంది పాల్గొన్న ఈ పోటీల్లో వంశీ కృష్ణంరాజు దర్శకత్వం వహించిన 'పరవసం' అనే షార్ట్ ఫిల్మ్ మొదటి స్థానంలో నిలిచి ఉత్తమ దర్శకుడు, జ్యూరీ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు రవి వర్మ, విజయ లక్ష్మి దంపతులు, కాళ్ల ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, టీడీపీ నాయకుడు గోకరాజు నాగరాజు, గ్రామస్తులు అభినందించారు.



విజిలెన్స్ దాడులు

9 గ్యాస్ సిలిండర్ల సీజ్

ఏలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల గృహావసరాల గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు హోటల్ యజమానులు వినియోగిస్తుండడంతో జిల్లా విజిలెన్స్ అధికారులు సోమవారం విస్తృత దాడులు చేశారు. తణుకులో మెసర్స్ గణేష్ కేటరర్స్‌లో తనిఖీ చేసి హోటల్ యజమాని సాహూ సత్యనారాయణ సబ్సిడీ గ్యాస్‌ను వ్యాపార అవసరాలకు వాడుతున్నట్లు గుర్తించి అతని నుంచి రూ.10,950 విలువైన 4 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. ఇదే ప్రాంతంలో మెసర్స్ రుచి కేటరర్స్‌ను తనిఖీ చేయగా ఐదు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడుతున్న హోటల్ యజమాని చట్రాతి వెంకట సీతారామారావు నుంచి రూ.13,591 విలువైన ఐదు సిలిండర్లను సీజ్ చేశారు. వీరిపై 1955 నిత్యావసరాల చట్టం కింద కేసులను నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి. మహేష్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్‌ఐ కె సీతారామ్, తహసీల్దార్ కన్యాకుమారి, రెవెన్యూ, పౌరసరఫరాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు, రైల్వే బ్రిడ్జి వల్లే కొల్లేరు ముంపు

- సమస్య పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే కామినేని
- అధికారులతో కలసి ఉప్పుటేరు పరిశీలన


ఉప్పుటేరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు ఆక్రమణలను తొలగించి కొల్లేరు ముంపు సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు మండలం ఆలపాడు శివారు సోమేశ్వరంలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న ఉప్పుటేరును ఆయన పరిశీలించి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ప్రారంభమయ్యాయని రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే కొల్లేరుకు ముంపు వచ్చే పరిస్థితు లుంటాయని గత ఏడాది ముంపుతో విజయవాడ సైతం మునిగిపోయిందని ఆ నీరు మొత్తం కొల్లేరు లోకి చేరి ఉప్పుటేరు మార్గం ద్వారా సముద్రంలో కలుస్తుందన్నారు. రెండు ప్రధానమైన కారణాలతో ఉప్పుటేరులో నీటి పారుదల కావడం లేదని, కొంత మంది రైతులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉప్పుటేరును ఆక్రమించి చెరువులు తవ్వకాలు చేశారని దీంతో 247 మీటర్ల వెడల్పు కాస్తా 80 మీట ర్లకు తగ్గిందని, ఇది నీటి ప్రవాహానికి అవరోధంగా మారిందన్నారు.

అలాగే ఉప్పుటేరుపై రైల్వే డబ్లింగ్ పనుల్లో నిర్మించిన బ్రిడ్జి పిల్లర్లు ఎత్తు అత్యంత దారుణంగా పెంచి ముంపు సమస్యను దృష్టిలో పెట్టుకోకుండా రైల్వే ఇంజనీరింగ్ అధికారులు అవగాహన లోపంతో నిర్మించారన్నారు. గతంలో నిర్మించిన పాతబ్రిడ్జికి స్పాన్ స్పాన్‌కి మధ్య 30 గజాల ఖాళీ ఉందని ప్రస్తుతం నిర్మించిన బ్రిడ్జికి రెండు పిల్లర్లకి మధ్య 10 గజాలు మాత్రమే ఖాళీ వదిలారని దీంతో నీటి పారుదల కావడం లేదన్నారు. ఉప్పుటేరు మార్గం ద్వారా 10 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్లాల్సి ఉండగా వీటి నిర్మాణంతో 5 వేల క్యూసెక్కుల నీరు కూడా పారుదల అయ్యే పరిస్థితులు కనపబడడం లేదన్నారు. రైల్వే అధికారులు నిర్మాణ దశలో వినియోగించిన 6 మీటర్ల వెడల్పు ఉన్న పైపులైన్ తొలగించకుండా వదిలివేశారన్నారు. దీనిపై శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజుతో కలిసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామని దీనిపై ఆయన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని రైల్వే ఉన్నతాధి కారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశిం చినట్లు తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ముంపు నివారణకు అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటామని కామినేని వెల్లడించారు. భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, ఆకివీడు, కైకలూరు డ్రెయినేజీ డీఈలు వినోద్, రామకృష్ణ, ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర చేపల రైతుల సం ఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, వడ్డి సాధికార సమితి కన్వీనర్ ఏసురాజు, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్ర రావు, కూటమి నేత కొల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కాళ్ల పీహెచ్‌సీలో రంగంనాయుదుని సత్కరిస్తున్న దృశ్యం

ఉత్తమ వైద్యాధికారి అవార్డు గ్రహీత రంగంనాయుడికి సత్కారం

కాళ్ళ, జూలై 21(ఆంధ్రజ్యోతి):ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా జిల్లా ఉత్తమ వైద్యాధికారి అవార్డును అందుకున్న కాళ్ల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సీహెచ్. రంగంనాయుడును వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సోమవారం సత్కరించారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని అవార్డుల తోపాటు రాష్ట్రస్థాయి అవార్డును సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం రంగంనాయుడు మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది కలిసి కట్టుగా పనిచేసి పీహెచ్‌సీకి మంచి పేరు తేవాలని కోరారు. వైద్యాధికారులు డాక్టర్ ఎస్.సునీల్, డాక్టర్ డి.సునీత, డాక్టర్ టి.భావన, సీహెచ్‌ఓ ఎన్.నాగమణి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా కంకర తరలింపుపై కేసు

ఉంగుటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి):పోలవరం ఎడమ కాల్వగట్టు కంసాలిగుంట గ్రామ సరిహద్దులో ఆదివారం ఉదయం ట్రిప్పర్ లారీలో కంకర నింపి తరలిస్తుండగా అధికారులు దాడులు చేసి నిలువరించారు. విషయం తెలుసుకున్న సబ్ డివిజన్ పోలవరం కుడి కాలువ ఇంజనీర్ కాకాని పార్థసారథి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసు లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడులు నిర్వహించిన వారిలో ఇన్‌చార్జి తహసీల్దార్ వై.పూర్ణ చంద్రప్రసాద్, ఎస్.ఐ. ఎం.సూర్యభగవాన్ ఉన్నారు. ఈ ఘటనలో ముంద్రు సుబ్బారావు(శ్రీకాంత్)పై కేసు నమోదు చేశామని తెలిపారు.


మందు మానేయమన్నందుకు.. విషం తిని ఆత్మహత్య

ఉంగుటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి):మద్యం మానమని ఒత్తిడి చేయడంతో జీవితం మీద విరక్తిచెంది పురుగులు మందు తిని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బాదంపూడికి చెందిన దారావతు భాను (23) వ్యవసాయ కూలీ, 2016లో దారావతు కవితతో వివాహమైంది. వీరికి ఇద్దరు మగ బిడ్డలు ఉన్నారు. భాను మద్యానికి బానిసై కవితను హింసించేవాడు. మద్యం మానమని పలుమార్లు ఒత్తిడి చేయడంతో జీవితం మీద విరక్తిపుట్టి భాను పలుమార్లు ఎలుకలు, దోమల మందు తినగా వైద్యం చేయించారు. తిరిగి ఆదివారం సాయంత్రం మరోమారు ఎలుకల మందు తినడంతో కుటుంబ సభ్యులు తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు చేబ్రోలు ఎస్.ఐ. ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

పాలకొల్లు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి):లంకలకోడేరులో సోమవారం లారీ ఢీకొని ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలోని భగ్గేశ్వరం గ్రామానికి చెందిన పాలా గంగారత్నం(55) తన కుమారుడు విఘ్నేశ్వర్‌తో కలిసి ద్విచక్రవాహనంపై లంకలకోడేరు పోస్టాఫీసు పనిమీద వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో గంగారత్నానికి బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గంగారత్నానికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు విఘ్నేశ్వర్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోటార్ సైకిల్‌పై లారీని తప్పించబోయి..


అనిత మృతదేహం

ముసునూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): చెక్కపల్లి-అక్కిరెడ్డిగూడెం ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. విశాఖపట్నం నుంచి చెక్కపల్లిలోని గ్రోమోర్ కంపెనీకి వస్తున్న లారీ గ్రామ శివారు లోని వేబ్రిడ్జి వద్దకు వెళుతోంది. లోపూడికి చెందిన మద్దాల అనిత(27), చిన్న కుమారుడు శశాంక్, ఆమె మేనల్లుడు నవీన్ బైక్‌పై రమణక్క పేట పీహెచ్‌సీకి వైద్యం నిమిత్తం తీసుకెళ్తుండగా లారీని తప్పించబోయారు. ఈ క్రమంలో లారీ ఒక్కసారిగా వీరి మీదకు రావడంతో అదుపుతప్పి రహదారిపై పడ్డారు. ఈ ప్రమాదంలో అనితపై లారీ చక్రం ఎక్కింది. ఆమెను 108లో నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. మృతురాలి మేనల్లుడు నవీన్ కుమార్‌కు తీవ్రగాయాలు కాగా వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు శశాంక్‌కు స్వల్ప గాయాలు కాగా చికిత్స చేసి కుటుంబీకులకు అప్పగించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని యువకుడు..

ఉంగుటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుగుంట వద్ద జాతీయ రహదారిపైకి వస్తున్న గొట్టాపు నాగరాజును ఓ లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. నాగరాజుది నాచుగుంట శివారు కొత్తగూడెం. ఏలూరు నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో తలకు బలమైన గాయం కావడంతో హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

టీచర్ ఆత్మహత్యపై అనుమానాలెన్నో..

- పొంతన లేని సమాధానాలు చెప్పిన భర్త
- అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు


దేవిక(ఫైల్)

ఏలూరు క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి):భర్త పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదని ఆత్మహత్య చేసుకుని మరణించిందని నమోదైన కేసులో ఆమె మరణంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ల ఆర్టీవో కార్యాలయం సమీపంలోని ఒక అపార్టుమెంటులో ఉంటున్న మండాడ దేవిక (చిన్నిదేవిక)(38) ఉంగుటూరు మండలం నల్లమాడు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త చిన్ని సురేంద్ర రాచూరు హైస్కూలు హెడ్ మాస్టార్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరు ఈ నెల 20న జరిగే ఉపాధ్యాయుల సమావేశానికి హాజరుకాలేదు. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో దేవిక ఇంట్లో ఉరి వేసుకుని ఉండడం సురేంద్ర తన కాళ్లు, చేతులు కోసుకుని అక్కడే పడి ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సురేంద్ర పొంతన లేని విధంగా పోలీసులకు వాగ్మూలం ఇస్తున్నారు. వారిద్దరి పిల్లలు విజయవాడలో చదువుకుంటున్నారు. తరచూ వీరు గొడవ పడుతున్నప్పుడు పిల్లలు తల్లి వైపే ఉండేవారని సురేంద్ర చెబుతున్నారు. సాధారణంగా భార్య ఆత్మహత్యకు పాల్పడి కళ్ళ ముందు ఉరికి వేలాడుతుంటే ఎవరైనా షాక్‌కు గురై భయంతో చుట్టుపక్కల వారిని పిలిచి ఆమె ప్రాణం కాపాడాలని ప్రయత్నిస్తారు. సురేంద్ర అలాంటి పనిచేయకుండా ఉరికి వేలాడుతున్న ఆమె మృత దేహం ముందు తన కాళ్లు, చేతులు కోసుకుని నేలపై ఆ రక్తంతో ఐ లవ్ యూ రాశానని చెప్పడంతోనే అనుమానాలు వస్తున్నాయి. సురేంద్ర స్కూలు నుంచి 3.57 గంటలకు వెళ్లినట్లు అధికారులు ఆ స్కూలులో వున్న సీసీ కెమేరా ద్వారా గుర్తించారు. కాని, అతను చెబుతున్న సమయం పొంతన లేకుండా ఉంది. అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమేరాలను, పోస్టుమార్టం నివేదిక, దేవిక, ఆమె భర్త సురేంద్ర సెల్‌ఫోన్ లొకేషన్లను పోలీసులు పరిశీలిస్తున్నారు. వీటి నేపథ్యంలో దేవిక మరణం వెనుకదాగి ఉన్న వాస్తవాలను నిగ్గు తేల్చనున్నారు. ఆమెది హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే ఈ విషయాన్ని స్పష్టం చేయనున్నారు.

లారీ ట్యాంకర్ ఢీకొని కూలీ మృతి

కాళ్ళ, జూలై 21(ఆంధ్రజ్యోతి):జక్కరంలో వాటర్ ట్యాంకర్ లారీ ఢీకొని నేరేడుగరువు ప్రాంతానికి చెందిన బొర్రా శివయ్య(45) మృతి చెందాడు. కాళ్ల మండలం బొండాడపేట గ్రామ శివారు నేరేడుగరువుకు చెందిన శివయ్య సోమవారం ఉదయం కూలీ పనినిమిత్తం వెళ్తుండగా భీమవరం నుంచి సీసలి వెళ్తున్న ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో శివయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శివయ్యకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కాళ్ళ ఎస్సై ఎస్. శ్రీనివాసరావు తెలిపారు.

ఇనుప రాడ్డుతో ఐదుగురి దాడి.. కేసు నమోదు

భీమవరం క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి):తనపై తన స్నేహితుడిపై ఇనుపరాడితో ఐదుగురు దాడి చేశారంటూ కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం చిన్నగొల్లపాలెం గ్రామానికి చెందిన తిరుమణి గణేశ్ భీమవరం టూ టౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. భీమవరం బీసీ కాలనీకి చెందిన ఒక యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో గణేశ్‌కు పరిచయమైంది. వీరిద్దరూ రోజూ మాట్లాడుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 20న గణేశు అతడి స్నేహితుడు దుర్గాప్రసాదులు భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న అతని స్నేహితుడిని పలకరించేందుకు వచ్చారు. తిరిగు ప్రయాణంలో ఆ యువతి వాట్సాప్‌లో కలవమని మెసేజ్ పెట్టడంతో గణేశ్, దుర్గాప్రసాద్‌లు బీసీ కాలనీ వెళ్లి యువతితో మాట్లాడారు. అనంతరం తిరిగి వెళ్తున్న సమయంలో అదే ప్రాంతంలో ఉన్న కృష్ణారెడ్డి మరో నలుగురు వీరిద్దరిని ఆపారు. తమ ప్రాంతానికి వచ్చి ఇక్కడ ఉన్న అమ్మాయితో మాట్లాడుతారా? అంటూ ఇనుపరాడ్డుతో ఇద్దరిపై దాడి చేశారు. ఈ దాడిలో గణేశ్‌కు తీవ్ర గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్‌ఐ రెహమాన్ తెలిపారు.

ఆస్పత్రికి వెళ్తూ ఇద్దరు అనంతలోకాలకు..


పరిశీలిస్తున్న ఎస్‌ఐ

హనుమాన్ జంక్షన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):హనుమాన్ జంక్షన్ బైపాస్ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్లకి చెందిన పసలపూడి రాఘవ(30), పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కృష్ణంపాలెం గ్రామానికి చెందిన ఎల్లమిల్లి భాస్కరరావు(50) ద్విచక్ర వాహనంపై ఆసుపత్రి పనిమీద విజయవాడ వెళ్తున్నారు. శేరీనరసన్నపాలెం అడ్డరోడ్డు సమీపంలోని హోసన్న మందిరం వద్ద ఏలూరు నుంచి విజయవాడ వెళ్తున్న లారీ వీరిని ఢీ కొనడంతో ఇద్దరూ దుర్మరణం చెందారు. ఎస్.ఐ. వి.సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలకు గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి):పట్టాలు దాటుతున్న ఒక వ్యక్తిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏలూరు జూట్ మిల్లు సమీపంలో ఓవర్ బ్రిడ్జి కింద సుమారు 55 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి సోమవారం ఉదయం రైలుపట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు లేత నీలం రంగు పొట్టి చేతుల టీషర్టు, సిమెంటు రంగు పొడవు చేతుల బనియన్, ముక్కుపొడుం రంగు ప్యాంటు ధరించాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎవరైనా (99892 19559) గుర్తుపడితే సమాచారం ఇవ్వాలన్నారు.

అప్పు తీర్చే మార్గం లేక వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాస్ మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి):చేసిన అప్పులు తీర్చేమార్గం లేక యాసిడ్ తాగి ఏలూరు కొత్తపేటనకు చెందిన వేముల శ్రీనివాస్(55) ఆత్మహత్య చేసుకు న్నాడు. ముగ్గురు పిల్లలు ఉండగా వారికి వివాహాలు చేశాడు. ఒక కిరణా షాపు నిర్వహిస్తున్నాడు. ఆర్థిక అవసరాల నిమిత్తం పలు ఫైనాన్స్ కంపెనీల దగ్గర అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చేమార్గం లేక సోమవారం ఉదయం తన ఇంటి వద్దే యాసిడ్ తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ఆస్పత్రికి తీసుకు రాగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అడిగిన డబ్బులు ఇవ్వలేదని మహిళ ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఏలూరు క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): తనకు ఆర్థిక సహాయం చేయమని తల్లిని కోరగా ఆ తల్లి నిరాకరించడంతో ఆగ్రహంతో ఒక మహిళ ఉరి వేసుకుని తీవ్ర అస్వస్థతకు గురై విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ మరడాని రంగారావు కాలనీకి చెందిన కొప్పుల అఖిల(24) భర్త మహేష్, ఒక కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. మహేష్ గత నెలలో ఒక రవాణా వాహనాన్ని కొనుగోలు చేశారు. అందుకు సంబంధించి లక్ష రూపాయలు సాయం చేయమని అదే ప్రాంతంలో ఉన్న తన తల్లిని అఖిల కోరింది. ఆమె ప్రస్తుతం చేయలేనని తరువాత చూస్తానని చెప్పింది. దీంతో ఈ నెల 15వ తేదీ రాత్రి అఖిల తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

మా కాలనీకి దారి చూపించండి మహాప్రభో

చింతలపూడి, జూలై 21(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నగర పంచాయతీలోని భట్టువారిగూడెం రోడ్డులో ఉన్న వైఎస్సార్ కాలనీకి దారి చూపించాలంటూ కాలనీవాసులు కోరుతున్నారు. కాంగ్రెస్ హయాంలో వైఎస్సార్ పేరుతో కాలనీ మంజూరైందని, కాలనీలో ఇప్పటికీ రోడ్లు, డ్రెయినేజీలు లేవని, గతంలో కొన్ని ఆందోళనలు చేశామని కాలనీవాసులు తెలిపారు. వర్షం వస్తే కాలనీలోకి వెళ్లాలన్నా ఇబ్బంది ఎదురవుతోందని, అధికారులు లేఅవుట్‌ను పరిశీలించి కాలనీకి దారి చూపించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు : ఎంపీపీ

కొయ్యలగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని ఎంపీపీ గంజిమాల రామారావు పేర్కొన్నారు. సోమవారం కొయ్యలగూడెంలో వివిధ సీసీ రోడ్లకు నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధుల ద్వారా అనేక సీసీ రోడ్లు నిర్మించామని మిగిలిన గ్రామాల్లో కూడా నిర్మిస్తామన్నారు. టీడీపీ మండల కార్యదర్శి బొబ్బర చినరాజు, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీశ్, ఎంపీటీసీ గంటసాల, పూలపల్లి రవి, శివాజీగణేశ్, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గంగుల నాగు, తిలక్ పాల్గొన్నారు.

చింతమనేనికి మంత్రి పదవి దక్కేలా చూడు తల్లీ..

దెందులూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలోని ప్రజలందరినీ చల్లగా చూడాలని చల్లచింతలపూడి యాదవులపేటలోని కోదండ రామాలయంలోని సీతమ్మతల్లిని టీడీపీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్య నారాయణ, మాజీ సర్పంచ్ ముమ్మడి మోహన్‌రావులు కోరుకున్నారు.సోమవారం యాదవులపేటలో గ్రామస్తులతో కలిసి సీతమ్మతల్లికి ఆషాఢసారెను సమర్పించారు. ఎమ్మెల్యే చింతమనేనికి మంత్రివర్గంలో చోటు దక్కాలని కోరుకున్నట్టు తెలిపారు.

మద్యం కేసును పక్కదారి పట్టించేందుకు యత్నాలు

చింతలపూడి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం బయటపడేసరికి ప్రజల ఆలోచనలు, దృష్టిని మళ్లించడానికి వైసీపీ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు కొమ్మరాజు సత్యనారా యణ ధ్వజమెత్తారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కొల్లు రవీంద్రపై ఎటువంటి ఆరోపణలు లేకుండా అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో అనేక అక్రమ కేసులు పెట్టినా ఒక్క కేసులో కూడా ఆధారాలు చూపలేకపోయారని, ఈ రోజున చేసిన అవినీతి బయటకు వస్తున్నాయన్నారు.

టెన్త్ పరీక్షల నిర్వహణ సిబ్బందికి పారితోషికం చెల్లించాలి

ఏలూరు అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి):మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల విధులు నిర్వర్తించిన చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులకు, ఇన్విజిలేటర్లకు రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనే యులు డిమాండ్ చేశారు. వీరితోపాటు జవాబుపత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొన్న చీఫ్ ఎగ్జామినర్లకు, అసిస్టెంట్ ఎగ్జామినర్లకు కూడా ఇంతవరకు పారితో షికాన్ని చెల్లించలేదన్నారు. అలాగే సప్లిమెంటరీ పరీక్షలు, స్పాట్ వాల్యూయేషన్ విధులు నిర్వర్తించినవారికి కూడా పారితోషికాన్ని చెల్లించేలా ప్రభుత్వ పరీక్షల కమిషనర్ వెంటనే చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దోమల నిర్మూలనపై అవగాహన

ఏలూరు అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి):ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే దోమల వ్యాప్తిని నియంత్రించవచ్చని లంబాడీపేట అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ట్వింకిల్ సూచించారు. డెంగీ జాతీయ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఏలూరులో అవగాహన ర్యాలీ నిర్వహించా రు. ఈ ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడుతూ సాధారణ జ్వరాలను కూడా అశ్రద్ధ చేయకూడదన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరులో సాల్వేషన్ ఆర్మీ సమావేశం

దెందులూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 134 దేశాల్లో సాల్వే షన్ ఆర్మీ(రక్షణ సైన్యం) విద్య, వైద్యం రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్టు సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజన్ కమాండర్ మేజర్ యేసురాజ్యం లతమ్మ పేర్కొన్నారు. సోమవారం దెందులూరు గౌడవీధిలోని మిలీనియం సాల్వే షన్ ఆర్మీ చర్చిలో కోర్ ఆఫీసర్ కాకి రమణయ్య, చర్చి దేవాలయ స్థల దాత పల్లె హర్షవర్ధన్ సిలువకుమారి సంఘ పెద్దల ఆధ్వర్యంలో సాల్వేషన్ ఆర్మీ సమావేశం నిర్వహించారు. సాల్వేషన్ ఆర్మీ జెండాను ఏగుర వేశారు.

నక్కా సుధాకర్‌కు మహోపాధ్యాయ అవార్డు అందజేత



ఉంగుటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పాకపాడు ప్రధానో పాధ్యాయులు నక్కా సుధాకర్‌కు మహోపాధ్యాయ అవార్డును ఆది వారం రాత్రి రాజమహేంద్రవరం లోని ఆనం కళాక్షేత్రంలో అందజేశారు. నన్నయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రసన్నశ్రీ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పా రావు, రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ రెడ్డిబాబు, అధ్యక్షులు గొర్రిపాటి భాస్కరరావు, కార్యదర్శి లాలం వెంకట శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు. ఈ అవార్డును సుధాకర్‌కు అందజేసి శాలువా జ్ఞాపికతో సత్కరించారు.

గురుకులంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తా..

భీమడోలు, జూలై 21(ఆంధ్రజ్యోతి): పోలసానిపల్లి గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఉమ్మడి పశ్చిమ గోదా వరి జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. స్థానిక పాఠశాలను సోమవారం సందర్శించిన పద్మశ్రీ విద్యార్థినులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. గురుకుల పాఠశాలలో కొంత భాగం తరగతి గదులు, ల్యాబ్ రూమ్‌లు శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ప్రస్తుతం 5 నుంచి 10వ తరగతి వరకే భవ నంలో తరగతుల నిర్వహిస్తున్నామని, ఇంటర్ విద్యార్థినులకు వసతి సౌకర్యం లేక ద్వారకాతిరుమల గురుకులానికి తాత్కాలికంగా పంపినట్టు ప్రిన్సిపాల్ భారతి చైర్ పర్సన్‌కు వివరించారు. కొత్త భవనం నిర్మాణం త్వరిత గతిన నిర్మించేలా ఉన్నతా ధికారులతో చర్చిస్తానన్నారు. ఎంఈవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు ఏఎంసీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

భీమడోలు, జూలై 21(ఆంధ్రజ్యోతి): భీమడోలు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ నూతన కార్యవర్గ ఎంపిక అట్టహాసంగా జరిగింది. తొలుత ఏఎంసీ కార్యాల యంలో ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, వైస్ చైర్మన్‌గా నిమ్మకాయల గణపతితో పాటు పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్స మట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు నూతన పాలకవర్గంతో సంబంధిత రికార్డుల్లో సంతకాలు చేయించారు. అభినందన సభలో ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, కూటమి నేతలు ఘంటా మురళీకృష్ణ, శరణాల మాలతీరాణి, విక్రం కిషోర్, కె కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై సీఐటీయూ ధర్నా

ఏలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాల ని డిమాండ్ చేస్తూ ఏలూరులోని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నేతలు ధర్నా చేశారు. ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, 2022లో ఇచ్చి మొబైల్ ఫోన్స్ సరిగ్గా పనిచేయడం లేదని, యాప్‌లు అప్‌లోడు కావడం లేదని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే సమీమా, రజనీలు ఆరోపించారు. మారుమూల ప్రాంతాల్లో నేటికీ సిగ్నల్ లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు హైమావతి, ఇస్సాకు, రవికుమార్‌లు పాల్గొన్నారు.

అర్వాయిపల్లి - నెమలిపేట మధ్య ప్రమాదకరంగా కల్వర్టు



కుక్కునూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అర్వాయిపల్లి, నెమలిపేట గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు కోతకు గురైంది. ఈ క్రమంలో తరచూ పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టును ఆనుకుని ఉన్న రహదారి కోతకు గురైంది. మలుపు దగ్గర్లో కల్వర్టు ఉండటంతో వాహన దారులు గమనించక ప్రమాదాలు జరుగుతు న్నాయి. ఇప్పటికైన కోతకు గురైన ప్రాంతంలో గ్రావెల్ నింపితే ప్రమాదాలు జరగకుండా ఉంటుంది. ఇప్పటికైన అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదసూచిక బోర్డులు కూడా ఏర్పాటు చెయ్యాలని కోరుతున్నారు.

జనం చెంతకు.. తొలి అడుగు

(5వ పేజీ తరువాయి)

శైలిలో ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. సాధ్యమైనంత మేర అధికారుల నుంచి సమాచారం రాబట్టి ఆయా సమస్యలను ఎప్పటిలోగా పూర్తి చేయగలుగుతామో భరోసా ఇస్తున్నారు. స్థానికులతో కలిసిపోవడం ఒక ఎత్తైయితే చొరవ తీసుకుని దూకుడుగా ముందుకు వెళ్లడంలో సీనియర్‌గా ప్రభాకర్ సక్సెస్ అయ్యారు. మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడు నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ తొలి అడుగులో పాల్గొన్నారు. ఆయన పర్యటించడానికి కుదరని పక్షంలో పార్టీ నేతలే దగ్గరుండీ మరీ ఆయా గ్రామాల్లో సుపరిపాలన గురించి వివరిస్తున్నారు. చింతల పూడి నియోజక వర్గంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ తొలి అడుగు ఆరంభంలో అందు కోలేకపోయారు. ఇప్పుడు తాజాగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. స్థానిక నేతలను కలుపుకుని పోయి ఇంటింటికి తిరుగుతున్నారు. కూటమి ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, కామినేని శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో స్థానిక కేడర్‌తో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జులు, పార్టీ పరిశీల కులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు బాధ్యత తీసుకుని గడపగడపకూ వెళుతున్నారు. దీనికి తోడు ఏ రోజుకారోజు కార్యక్రమం అమలు చేస్తున్న తీరు, పాల్గొంటున్న నేతల వివరాలను అధినాయకత్వానికి నివేదిస్తున్నారు. జిల్లాలో పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వివిధ నియోజకవర్గాలను సమన్వయం చేస్తూనే, ఆయన స్వయంగా ఉంగుటూరు నియోజకవర్గంలో తొలి అడుగులో పాల్గొన్నారు.

ఇంటింటికీ సుపరిపాలన

అర్జీలపై ఎమ్మెల్యేల విస్తృత సమీక్ష - సమస్యల పరిష్కారమే ధ్యేయమంటూ స్పష్టం



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరుటూటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటికలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఎమ్మెల్యే చంటి అన్నా రు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చంటి మాట్లాడు తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం లో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటు న్నట్టు తెలిపారు.నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నామని, గతపాలకులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలంటే భయపడేవారని ఎద్దేవా చేశారు.

ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం ఆధ్వర్యంలో..

పోలవరం: రాష్ట్రాభివృద్ధి, ఉపాధి కల్పన దిశగా కూ టమి ప్రభుత్వం ముందుకువెళుతుందని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. సోమవారం పో లవరం మండలం ప్రగడపల్లి పంచాయతీ మామిడి గొందిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివ రించారు. నాయకులు డి.బాబూరావు పాల్గొన్నారు.

తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి..

లింగపాలెం:ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథ కాల రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అంది స్తామని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని ని యోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి మల్లి కార్జునరావు అన్నారు. లింగపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్ప డిన ఏడాదిలోనే రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. తాతిన రాధాకృష్ణ, బాషా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సుపరిపాలన అర్జీలపై సమీక్ష...

దెందులూరు:నియోజకవర్గంలోని నాలుగు మండలా ల్లో సుపరిపాలనపై తొలి అడుగులో పర్యటించినప్పుడు ప్రజల నుంచి వచ్చిన వినతులు,ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అ న్నారు. సోమవారం దెందులూరు ఎంపీడీవో కార్యాల యంలో ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ ఆధ్వ ర్యంలో నాలుగు మండలాల అధికారులతో సుపరిపా లనపై తొలి అడుగు ఇంటింటి ప్రచారంలో వచ్చిన విన తులు, ఫిర్యాదులపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. కొన్ని కారణాలతో తల్లికి వందనం నగదు జమకాని వారి వివరాలతో కలెక్టర్‌కు ఫోన్ ద్వారా చింతమనేని సమాచారం అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్, నంభూరి నాగరాజు, మరడాని రవి, మిల్లుబాబు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఉత్సాహంగా పర్యటన..

గత వైసీపీ ప్రభుత్వం పోతునూరు గ్రామానికి ఏం చేసిందో చెప్పాలని తాము అధికారంలోకి రాగానే రూ కోటి రూపాయిలతో సిమెంట్ రోడ్లు నాణ్యతతో వేయి స్తున్నామని దెందులూరు శాసన సభ్యులు ఒతమనేని ప్రభాకర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమంలో భాగంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ యూనిట్ పోతునూరు, దోసపాడు, ముప్పవరం, సీతం పేట, సత్యనారాయణపురం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇన్‌చార్జి బాయి రాంప్రసాద్, టీడీపీ గ్రామాధ్యక్షులు నున్న లక్ష్మణ్, బ్యాంక్ అధ్యక్షుడు మోహన్, సర్పంచ్ గోరింక యేసోబు, మాజీ సర్పంచ్ కుచ్చెర్ల పాటేశ్వరరావు, బ్యాంక్ అధ్యక్షులు యలమర్తి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ నైవకా రాజా, పర్వతనేని రామకృష్ణ, కలపాల చంద్రశేఖర్, కలపాల శ్రీహరి, టీడీపీ మండ లాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, మోతుకూరి నాని, డాక్టర్ పసుమర్తి మధుబాబు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల భద్రతపై విస్తృత అవగాహన



శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జయబాబు

టి.నర్సాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక జూ నియర్ కాలేజీలో మహిళల భద్రత, శక్తి యాప్ విని యోగంపై సైబర్ నేరాలపై జాగ్రత్తలు, రోడ్డు భద్రత అంశాలపై ఎస్.ఐ. జయబాబు ఆధ్వర్యంలో సోమ వారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు అత్యవసర సమయంలో పోలీసుల సహాయం పొం దేందుకు శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. మహిళలు తమ ఫోన్లలో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం బీఎల్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై..

ఉంగుటూరు: బాల్య వివాహ వ్యతిరేక ఉద్యమం లో భాగంగా సోమవారం మండలంలోని గొల్లగూడెం, చేబ్రోలు హైస్కూళ్లలో వీధి నాటికను ప్రదర్శించారు. చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యంలో జరిగిన వీధి నాటికలో ప్రధానోపాధ్యాయులు సాయిబాబు, పి. మల్లేశ్వరిలు బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవ గాహన కల్పించారు.గొల్లగూడెంలో సిబ్బంది సి.హెచ్. రేఖ, నయన్, తార్రశీనివాస్, మెడికల్ అధికారి శ్రావణి కుమారి, ఎఎన్ఎం.పి.విజయ కుమారి ఆశా వర్కర్ కృపారత్నం, అంగన్వాడీ టీచర్ గ్రేస్, చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ జిల్లా సమన్వయకర్త ఎస్.రవిబాబు సిబ్బంది ఉపాధ్యాయులు ఎల్.విజయలక్ష్మి, ఎస్.కే. హలీమా బీబీ, కే.చంటమ్మ, మణి, ఏ.ఎన్ ఎం.సరోజిని, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఫోక్సో చట్టాలు, సైబర్ నేరాలపై..

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశా లలో చింతలపూడి పోలీసులు అవగాహన కల్పించా రు. ఫోక్సో చట్టం పిల్లలను లైంగిక వేధింపుల నుంచి రక్షించడానికి ఉద్దేశించబడిందని, పిల్లల భద్రత, రక్ష ణకు చట్టబద్ధమైన నిబంధనలపై సీఐ క్రాంతికుమార్ వివరించారు. ఇంటర్నెట్, సోషల్ మీడియాలో జాగ్ర త్తలు, భద్రతపై ఎస్ఐ సతీశ్‌కుమార్ సూచనలిచ్చారు.

బాలల అక్రమ రవాణాపై...

ఏలూరు అర్బన్: ప్రపంచ మానవ అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు రైల్వేస్టేషన్‌లో రెస్క్యూ ఆపరేషన్లను నిర్వ హించారు. బాలలను అక్రమంగా తరలిస్తున్నా, ఎవ రైనా అనుమానితులు తారసపడినా వెంటనే సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రయాణికులకు సూచించారు.క్రాఫ్ ప్రతినిదులు వినోద్‌కుమార్, రాజ్య లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నారుమడులపై జాగ్రత్తలు వహించాలి

లింగపాలెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): వరి నారుమడు ల్లో నీరు ఎక్కువగా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ అన్నారు. మండలంలోని యడవల్లిలో నారుమడులను ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చే శారు. నాట్లు వేసే సమయంలో అధికంగా పురుగు మం దులు, రసాయన ఎరువులను వాడకూడదన్నారు. రైతుల కు ఎటువంటి సందేహాలున్నా రైతు సేవా కేంద్రాల్లో సిబ్బం దిని, మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలన్నారు.



స్వాగతం పలికిన లయన్స్ సభ్యులు

లయన్స్ విస్తృత సేవలందించాలి

ఏలూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి):లయన్స్ జిల్లా 316 జిల్లా గవర్నర్‌గా ఎన్నికై అమెరికాలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అధ్యక్షతన ప్రమాణ స్వీకారం చేసి ఏలూరు తిరిగి వచ్చిన ఎన్‌వివిఎస్ పాపారావు నాయుడు దంపతు లకు ఘన స్వాగతం లభించింది. జిల్లా క్యాబినెట్ సెక్రటరీ ఎస్.కామేశ్వరరావు, కోశాధికారి కె.రామలింగేశ్వరరావు, రీజి యన్ చైర్‌పర్సన్ వి.శ్రీనివాస్ గోపాల్, పి.లక్ష్మీనారాయణ, జోన్ చైర్‌పర్సన్ సి.హెచ్.మాధవి ఆధ్వర్యంలో ఘన స్వాగ తం పలికారు. మురళీమోహనరావు, డాక్టర్ పి.విజయభా స్కర్‌రెడ్డి, వి.కె.పంకజాక్షన్, లక్ష్మీనారాయణ, వి.సత్యస్వరూప్, ఎల్ వెంకటేశ్వరరావు, డి.హేమసుందర్, కూర్మ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నివాస్



కొయ్యలగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొయ్య లగూడెం పట్టణానికి చెందిన వీరవరపు నివాస్‌ను నియమించారు. సోమవారం నియమక ఉత్తర్వులిచ్చినట్టు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామస్థాయిలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా నివాస్‌ను పలువురు బీజేపీ నాయకులు అభినందించారు.

కుంగ్ ఫూ మాస్టర్‌కు ఎమ్మెల్యే అభినందన

జంగారెడ్డిగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): కుంగ్ ఫూ మాస్టర్‌గా ఉత్తమ ప్రతిభ కనబరిచిన మాస్టర్ గంధం సురేష్ నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డును విజయవాడలో సినీ నటుడు భానుచందర్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం చింతలపూడిలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ను కలవగా ఆయన అభినందించారు. డి.శ్యామ్ చంద్రశేషు, షేక్ ముస్తఫా ఉన్నారు.

మహిళల సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురండి : డీఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పోలీస్ అధికా రులకు తెలియజేయడం గ్రామ సంరక్షణ కార్యదర్శుల ముఖ్య బాధ్యత అని ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్ కుమార్ అన్నారు. మహిళల భద్రత, సంక్షేమం, సా మాజిక సాధికారితపై అవగాహన పెంచేందుకు వార్డుల స్థాయిలో మహిళల సమస్యలను వేగంగా పరిష్కరిం చేందుకు ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులతో సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ లూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ చట్ట పరంగా మహిళలకు లభించే రక్షణ, హక్కులు, బాధి తులకు అందేసహాయ వనరులపై అవగాహన కల్పిం చాలన్నారు. ఫోక్సో చట్టం, గృహ హింస నివారణ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరా లకు గురికాకుండా మహిళలను, యువతలను అప్ర మత్తం చేయాలన్నారు. శక్తియాప్ ప్రాధాన్యతపై ప్రజలకు తెలియజేయాలన్నారు. ఏలూరు టూటౌన్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ మధువెంకట రాజా, మహిళా ఎస్ఐ నాగకల్యాణి, పలువురు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పోలీస్ స్టేషన్ భవనం



నిర్మాణం పూర్తయిన పోలీస్ స్టేషన్

జీలుగుమిల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): నూతన పోలీస్ స్టేషన్ భవ నం ప్రారంభానికి సిద్ధమౌతోంది. దీంతో పాటు ఎంతోకాలంగా పోలీస్ సిబ్బంది ఎదరు చూస్తున్న క్వార్టర్స్ నిర్మించారు. మారుమూల ప్రాంతా ల్లో ఇప్పటికే పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తూ స్థానికంగా ఉండేం దుకు అద్దె ఇల్లు దొరక్క కొందరు ఇబ్బందులు పడుతున్నారు. రూ.2.50 కోట్లతో ఏపీ పోలీస్ హౌసింగ్ ద్వారా నిర్మాణం పనులు దాదాపు పూర్తి చేశారు. జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఉన్నతాధి కారుల ఆదేశాలు మేరకు త్వరలో ప్రారంభిస్తారన్నారు.

సమస్యలు, అర్జీలు, వినతులు

కొల్లేరు కాంటూరు వివరాలివ్వాలని వినతి

ఏలూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కొల్లేరుకు సంబంధించి సుప్రీంకోర్టుకు సమర్పించిన కాంటూరు లోని సర్వే నెంబర్లు వాటి విస్తీర్ణం, అటవీ శాఖకు కొల్లేరు భూములను ఏ ప్రాతిపదికన అభయారణ్య భూమిగా నిర్ణయించాలని కోరుతూ దెందులూరు నియోజకవర్గం లోని జడ్పీటీసీలు మండల సరస్వతి కొండలరావు, నవ కాంతం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి,డివిజనల్ అటవీ శాఖ అధికారి విజయను కలిసి పత్రం అందజేశారు. కొల్లేరు ఆపరేషన్ తరువాత రెవెన్యూ శాఖ నిర్ణయించిన కాం టూరు హద్దుల వివరాలు, రాడార్ సర్వే వివరాలు తెలి యజేయాలని విజ్ఞప్తి చేశారు. కాంటూరు ఐదో మ్యాప్‌ను ఎవరూ తయారు చేశారో తెలపాలన్నారు.

అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తగదు

చింతలపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలిం తలు, చిన్న పిల్లలకు ఆహారం, ఆరోగ్యం అందించాలని పోషణ ట్రాక్టర్ యాప్, బాల సంజీవిని యాప్ తీసుకొ చ్చి లబ్ధిదారులను అంగన్‌వాడీ సెంటర్లకు దూరం చేసే విధానాలు అమలు చేస్తున్నారని సీఐటీయూ మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరరావు అన్నారు. 2021లో ఇందుకోసం ఫోన్‌లు ఇచ్చారని, 90 శాతం ఫోన్‌లు చెడి పోయాయని, యాప్‌ల నిర్వహణకు నెట్ స్పీడులేదని, వర్కర్స్‌కు ఎటువంటి ట్రైనింగ్ ఇవ్వకుండా మారుమూల ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్నారని అంగన్‌వాడీ కా ర్మిక నాయకురాళ్లు ఎస్.సరోజిని, టి.మాణిక్యం పేర్కొ న్నారు. ఈ మేరకు కొద్దిసేపు రాష్ట్ర పిలుపు మేరకు ఐసీ డీఎస్ కార్యాలయం వద్ద ధర్నా జరిపారు. చెన్నకేశ్వరి, శ్యామల, సత్యవతి, కె.కవిత, అరుణకుమారి, పలువురు పాల్గొని ఐసీడీఎస్ పీవోకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఫేస్ యాప్‌ల విధానం తొలగించండి

బుట్టాయగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వా డీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు, గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు ఫేస్ యాప్‌లను రద్దు చేసి సెం టరు నిర్వహణకు ఒక్క యాప్‌ను మాత్రమే కొనసా గించాలంటూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ)ఆధ్వర్యంలో సోమవారం ఐసీ డీఎస్ కార్యాలయం ఎదుట వర్కర్లు, హెల్పర్లు ధర్నా చేశారు. అనంతరం యూడీసీ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి కె.పుష్ప మా ట్లాడుతూ వివిధ రకాల యాప్‌ల ద్వారా లబ్ధిదారులకు సరుకులిచ్చే నిబంధనను తొలగించాలన్నారు. నాయకులు వరలక్ష్మి, సీత, సుధ, రామలక్ష్మి, నూర్జహాన్, నాగమణి, మారమ్మ, ఆకాష్, నాగలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

సిగ్నల్ సమస్యలతో ఇబ్బందులు

కొయ్యలగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో యాప్‌ల విధానంపై అంగన్వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద కార్యకర్తలంతా నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. మారుమూల గ్రామాల్లో సిగ్నల్స్‌లేక యాప్‌ల విధానంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. జిల్లా కార్యదర్శి భారతి, శివరత్నకుమారి, నాగవేణి పాల్గొన్నారు.

నిర్వాసితులకు సదుపాయాలు కల్పించండి

బుట్టాయగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్ ఆర్ నిర్వాసితుల కాలనీల్లో మౌలిక సదుపాయాలు క ల్పించాలని కోరుతూ సోమవారం కె.ఆర్.పురం ఐటీడీఏ లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పీవో కె.రాములు నాయక్‌ను కలిసి నిర్వాసితులకు వినతిప త్రాలు అందజేశారు. కనీస సదుపాయాలు లేకపోవ డంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అసం పూర్తి కాలనీలకు తమను తరలించారని సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం కాలనీలో ప్లాట్లు కేటాయించినా ఇళ్ళు నిర్మించలేదని ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బండి కుమారస్వామి, రాంబాబు, పూజితలు పీవోను కోరారు. ఇన్‌చార్జి ఏపీవో ఎం.శ్రీనివాసరావు, వెలుగు ఏపీడీ రాజబాబు పాల్గొన్నారు.

అవినీతిపై దర్యాప్తు చేయండి

ఏలూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో దీర్ఘకా లంగా విధులు నిర్వహిస్తున్న ప్లానింగ్ సూపర్‌వైజర్ సాంబశివరావు అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలం టూ దళితసేన ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాశ్ ఆధ్వర్యంలో జేసీని కలిసి వినతి పత్రం అందజేశారు. సాంబశివరావు రాజకీయ అండ దండలతో ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాడని అన్నారు. దీర్ఘకాలంగా ఏలూరు టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యదర్శి లక్క పాము చంటి, బులా రవికుమార్, విస్స న్నపల్లి సురేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సీపీఎం

ద్వారకాతిరుమల, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్య దర్శి వి.రాంగోపాల్ ప్రజలకు సూచించారు. ద్వారకాతి రుమల యూటీఎఫ్ భవనంలో సోమవారం సీపీఎం జిల్లాస్థాయి విస్తృత సమావేశాలు ఎం.నాగమణి అధ్యక్ష తన ప్రారంభమయ్యాయి.పామాయిల్, కోకో వంటి పం టలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీనియర్‌నేత బి బలరాం విమర్శించారు. ఎ.రవి, ఆర్.లింగరాజు, డీఎస్పీడీ ప్రసాద్, కె.శ్రీనివాస్, కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

కమిషనర్‌కు కార్మికుల సమ్మె నోటీసు

చింతలపూడి, జూలై 21(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నగర పంచాయతీలో నాలుగున్నర సంవత్సరాల నుంచి నగర పంచాయతీగా మార్పు చెందినా పారిశుధ్య కార్మి కులకు జీవోల ప్రకారం జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు కమిషనర్ రాంబాబుకు సమ్మె నోటీసులిచ్చా రు. సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు సత్యనారా యణ మాట్లాడుతూ ఈ విధంగా పారిశుధ్యకార్మికులకు నాలుగున్నరేళ్లుగా జీతాలు చెల్లించకపోవడంతో ఒక్కొ క్కరికి రెండున్నర లక్షల రూపాయలు నష్టపోయారని, ఇప్పటికీ వారి బతుకులు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. జీవో ప్రకారం జీతాలు ఇవ్వకపోతే నగర పంచాయ తీలో సమ్మె చేయడానికైనా వెనుకాడబోమని మునిసి పల్ కమిషనర్ ఎ.రాంబాబుకు సమ్మె నోటీసులిచ్చారు. కార్మిక నాయకురాళ్లు టి.వళ్ళీ, వి.అనురాధ, బి.పద్మ, కమల కుమారి, బి.రాము, టి.బాబు పాల్గొన్నారు.

చెరువులో చెత్త వేయడంపై ఫిర్యాదు

ఏలూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): టినర్సాపురం సమీపంలో ఉన్న రజకుల చెరువును 15 అడుగుల లోతులో గ్రీన్ ఫీల్డ్ హైవే సిబ్బంది తవ్వేశారని కలెక్టర్‌కు బీకేఎంయూ టినర్సాపురం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు ఫిర్యాదు చేశారు. చెరువులో మద్యం బాటిళ్లు, గాజు పెంకులు, చెత వేయడంతో రజకులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నా రు. చెరువులో దిగితే ప్రమాదం కాళ్లకు పెంకులు గుచ్చుకునే ప్రమాదం ఉందని, గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడంలేదని జయరాజు కలెక్టర్‌కు వివరించారు.



చెస్‌బోర్డులు పంపిణీ

ఏలూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): చదరంగంలో మక్కువ ఉండి చెస్ నేర్చుకోవడానికి ఆర్థికంగా వెనుకబడిన పేద, అనాథ పిల్లలను ప్రోత్సహించేందుకు ఆంధ్రాచెస్ అసోసియేషన్ కృషి చేస్తోంది. ఏలూరు శనివారపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో చదరంగంపై ఆసక్తి ఉన్న పేద విద్యార్థులను గుర్తించి వికింగ్స్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో చెస్ బోర్డులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. పర్యవేక్షణాధికారి పి.శ్రీవల్లి, చెస్‌కోచ్ ఎస్.శ్యామల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతికి సంతాపం

ఏలూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం, రాజకీయ కురువృద్ధుడు, సీపీఐ నాయకులు వి.ఎస్.అచ్యుతానందన్ మృతికి ఏలూరు జిల్లా సమితి సంతాపం తెలిపింది. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరని లోటన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన వ్యవధిని పాటించాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం వాల్ పోస్టర్లను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించాలని కోరారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఎంహెచ్‌వో అమృతం, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

లింగపాలెం, జూలై 21(ఆంధ్రజ్యోతి):ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ భోగేశ్వరరావు ఆధ్వర్యంలో లింగపాలెంలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన మహిళ నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఆమెకు సారా సరఫరా చేసిన నాగిరెడ్డిగూడేనికి చెందిన మరో మహిళ పరారైందని ఆమెపై కూడా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈదాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐలు అబ్దుల్ ఖలీల్, జగ్గారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టీడీపీ మండల సమావేశం

జీలుగుమిల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్టు మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి తెలిపారు. జగదాంబ ఉత్సవాలు జరిపే ప్రదేశంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. పోలవరం టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, మండల పరిశీలకులు రావూరి కృష్ణ సమావేశంలో పాల్గొంటారు. నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జ్‌లు, గ్రామాధ్యక్షులు హాజరు కావాలన్నారు.



పట్టిసీమ పంపుల తగ్గింపు

పోలవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి):పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 4,248 క్యూసెక్కుల గోదావరి వరదను దిగువకు విడుదల చేసినట్టు ఈఈ యేసుబాబు సోమవారం తెలిపారు. కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సాగు అవసరం మేరకు నీటిని విడుదల చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 12 పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

పట్టిసీమ శివక్షేత్రంలో పూజలు

పోలవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి):పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో బిల్వార్చన, భస్మార్చన, పంచామృత అభిషేకం,ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. గోదావరికి వరద పోటు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో భక్తుల తాకిడి కొంత తగ్గింది. గుంజవరం ఉమాసహిత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా సుమారు రెండు వేల మంది భక్తులు ఆలయ దర్శనం చేసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

ఆస్పత్రికి సదుపాయాలు కల్పిస్తాం

భీమడోలు, జూలై 21(ఆంధ్రజ్యోతి): సామాజిక వైద్య కేంద్రానికి అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు సామాజిక వైద్య కేంద్ర అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన క్షయవ్యాధి నిర్మూలన కర పత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ప్రత్తి మదన్, ఎన్.గణపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

ముదినేపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పేరూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ కృష్ణ యాదవ సేవా సంఘం మండల అధ్యక్షుడు సోమా సత్యనారాయణ నోటు పుస్తకాలు, ఇతర స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. సోమవారం పాఠశాలలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ యాదవ్ విద్యార్థులకు మెటీరియల్ అందించారు. గుడివాడ ఏఎంసీ వైస్ చైర్మన్ నాగసుబ్బారావు, పేరూరు టీడీపీ అధ్యక్షుడు జడ్డు సత్యనారాయణ నాయకులు కారుమూరి నాగరాజు, వీర్ల గంగరాజు, డొక్కు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి

ఆగిరిపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిహెచ్ శివనాగరాజు డిమాండ్ చేశారు. నెక్కలం గొల్లగూడెం గ్రామం, సుందరయ్య నగర్‌లో 2005 నుంచి పేదలు ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారని పట్టాలు మంజూరు చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

టీచర్ ఆత్మహత్యపై అనుమానాలెన్నో..?

ఏలూరు క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): భర్త పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదని ఆత్మహత్య చేసుకుని మరణించిందని నమోదైన కేసులో ఆమె మరణంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏలూరు రూరల్ ప్రాంతం చొదిమెళ్ల ఆర్టీవో కార్యాలయం సమీపంలోని ఒక అపార్టుమెంటులో ఉంటున్న మందాడ దేవిక (చిన్నిదేవిక)(38) ఉంగుటూరు మండలం నల్లమాడు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త చిన్ని సురేంద్ర రాచూరు హైస్కూలు హెడ్ మాస్టార్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరు ఈ నెల 20న జరిగే ఉపాధ్యాయుల సమావేశానికి హాజరుకాలేదు. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో దేవిక ఇంట్లో ఉరి వేసుకుని ఉండడం సురేంద్ర తన కాళ్లు, చేతులు కోసుకుని అక్కడే పడి ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సురేంద్ర పొంతన లేని విధంగా పోలీసులకు వాగ్మూలం ఇస్తున్నారు. వారిద్దరి పిల్లలు విజయవాడలో చదువుకుంటున్నారు. తరచూ వీరు గొడవ పడుతున్నప్పుడు పిల్లలు తల్లి వైపే ఉండేవారని సురేంద్ర చెబుతున్నారు. సాధారణంగా భార్య ఆత్మహత్యకు పాల్పడి కళ్ల ముందు ఉరికి వేలాడుతుంటే ఎవరైనా షాక్‌కు గురై భయంతో చుట్టుపక్కల వారిని పిలిచి ఆమె ప్రాణం కాపాడాలని ప్రయత్నిస్తారు. సురేంద్ర అలాంటి పనిచేయకుండా ఉరికి వేలాడుతున్న ఆమె మృతదేహం ముందు తన కాళ్లు, చేతులు కోసుకుని నేలపై ఆ రక్తంతో ఐ లవ్ యూ రాశానని చెప్పడంతోనే అనుమానాలు వస్తున్నాయి. సురేంద్ర స్కూలు నుంచి 3.57 గంటలకు వెళ్లినట్లు అధికారులు ఆ స్కూలులో వున్న సీసీ కెమేరా ద్వారా గుర్తించారు. కాని, అతను చెబుతున్న సమయం పొంతన లేకుండా ఉంది. అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమేరాలను, దేవిక, ఆమె భర్త సురేంద్ర సెల్‌ఫోన్ లోకేషన్లను పోలీసులు పరిశీలించారు. వీటి నేపథ్యంలో దేవిక మరణం వెనుక దాగి ఉన్న వాస్తవాలను నిగ్గు తేల్చనున్నారు. ఆమెది హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే ఈ విషయాన్ని స్పష్టం చేయనున్నారు.

స్వచ్ఛందంగా తూడు తొలగింపు



కలిదిండి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కొండంగి ఎత్తిపోతల పథకం వద్ద కాల్వలో దట్టంగా పేరుకుపోయిన తూడు, డెక్కను కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరస్వామి, పేటేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ సందర్భంగా డీసీ చైర్మన్లు మాట్లాడుతూ ఉప్పుటేరులో నీరు తీపెక్కడంతో ఎత్తిపోతల పథకాన్ని ఈ నెల 22న పునః ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో స్వచ్ఛందంగా కాల్వలో డెక్క తొలగిస్తున్నామన్నారు.

మంత్రికి అరుణ కృతజ్ఞతలు



నూజివీడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కూటమి మిత్రత్వంలో భాగంగా అనూహ్యంగా నూజివీడు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవి బీజేపీకి కేటాయింపు జరిగింది. సోమవారం విజయవాడలో మంత్రి పార్థసారథిని నూజివీడు బీజేపీ నాయకులు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అభ్యర్థిగా ఎంపికైన అరుణతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సహకార సంఘాల పరిపుష్టికి చేయూత



ఉప్పరగూడెం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార సభలో ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పూర్తి స్థాయి రైతు సేవా కేంద్రాలుగా రూపొందించేందుకు, సంఘాల సేవలను మరింత విస్తృతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఉప్పరగూడెం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా గునుపూడి నాగరాజు, సభ్యులుగా వీరమల్లు సుబ్బారావు, శ్యామ సుందరరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే కామినేని ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలవరం నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఇరిగేషన్, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉప్పరగూడెం సంఘ త్రిసభ్య కమిటీని అభినందించారు.

సొసైటీ అధ్యక్షుడిగా గణేష్ ప్రమాణ స్వీకారం



ముసునూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గోపవరం కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఉప్పలపాటి గణేష్, డైరెక్టర్లుగా పులిచర్ల భూచక్రధరరావు, పోలిమెట్ల స్వరూపరాణితో కార్యదర్శి పలగాని వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, గ్రామ మాజీ అధ్యక్షులు బొల్లినేని బుజ్జియ్య, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మాజీ సభ్యులు నందిగం లక్ష్మీపెరుమాళ్ళు, టీడీపీ నాయకులు సత్కరించారు. టీడీపీ యువసేవ ఆధ్వర్యంలో యువకులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను గణేష్ కట్ చేశారు. సొసైటీ అభివృద్ధితోపాటు రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా గణేష్ తెలిపారు.

చిగురుకోట త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



ముదినేపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చిగురుకోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టింది. సంఘ కార్యాలయంలో కమిటీ చైర్మన్‌గా తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, సభ్యులుగా భట్రాజు శ్యామల రాజు, కుంచె కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, తెలుగు మహిళా జిల్లా కార్యదర్శి కందేపి పద్మతోపాటు పలువురు టీడీపీ నాయకులు, సంఘ సీఈవో వై.సేతు మాధవన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ముసునూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని, కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్ డిమాండ్ చేశారు. సోమవారం ముసునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల కార్యదర్శి వేముల బక్కయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ రమణక్కపేటలో అటవీ భూముల సమస్య పరిష్కారం కోసం జేసీ తక్షణమే భూములను పరిశీలించి, ఫారెస్ట్ కిందకు రాని 420 ఎకరాలకు సత్వరం పట్టాలు పంపిణీ చేయాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును రద్దు చేయాలని, వంట ఏజన్సీలకు పెంచిన మెనూ చార్జీలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, ఉపాధి పనిదినాలను 200 రోజులకు పొడిగించి, రోజుకు రూ. 600 వేతనం ఇవ్వాలని జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. లిబరేషన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	228
చికెన్ స్కిన్‌లెస్	238

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

కోతులు బాబోయ్.. కోతులు!



నూజివీడు ఆర్డీవో కార్యాలయంపై వానరాలు

- కుక్కలతోనూ వెతలు
- నూజివీడు వాసుల గగ్గోలు
- చర్యలు తీసుకోవాలని వినతి

నూజివీడు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వానరాలు, శునకాల పేరు చెప్తే నూజివీడు వాసులు హడలిపోతున్నారు. మందలు మందలుగా వానరాలు స్వైర విహారం చేస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. వీటి బెడద నుంచి రక్షించాల్సిందిగా పట్టణ వాసులు వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నూజివీడు పట్టణంలోని బంగినపల్లి తోట, అమ్మవారి తోట స్టేషన్, ఆర్డీవో కార్యాలయం, ట్రిపుల్ ఐటీ తదితర ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతులు ఇళ్ళలోకి ప్రవేశించి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని చివరికి బాత్రూంలోకి కూడా ప్రవేశిస్తున్నాయని పట్టణ వాసులు వాపోతున్నారు. ఇక నూజివీడు ఎంఆర్‌ఎఫ్ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడదతో పట్టణ వాసుల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు.

ప్రయోగాలు విఫలం

కోతుల దాడిని అరికట్టేందుకు నూజివీడు మున్సిపల్ అధికారులు వినూత్న రీతిలో చింపాంజీ దుస్తులతో ఇద్దరు మున్సిపల్ సిబ్బందిని నియమించారు. అయినా ఆ ప్రయత్నం నిరుపయోగంగా మారింది. చివరికి కోతులను తోలేందుకు శబ్దాలు చేసే గనులను సైతం రప్పించినా అవి పని చేయలేదు.

కోతులను పట్టి తరలించండి..

కోతులు, శునకాలను పట్టి వాటి సంతతిని పెరగకుండా నిరోధించడంతో పాటు అటవీ ప్రాంతాలకు తరలించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఆక్రమణలు, రైల్వే బ్రిడ్జి వల్లే కొల్లేరు ముంపు

అధికారులతో కలసి ఉప్పుటేరును పరిశీలించిన ఎమ్మెల్యే కామినేని



ఉప్పుటేరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు ఆక్రమణలను తొలగించి కొల్లేరు ముంపు సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు మండలం ఆలపాడు శివారు సోమేశ్వరంలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న ఉప్పుటేరును ఆయన పరిశీలించి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ప్రారంభమయ్యాయని రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే కొల్లేరుకు ముంపు వచ్చే పరిస్థితులుంటాయని గత ఏడాది ముంపుతో విజయవాడ సైతం మునిగిపోయిందని ఆ నీరు మొత్తం కొల్లేరులోకి చేరి ఉప్పుటేరు మార్గం ద్వారా సముద్రంలో కలుస్తుందన్నారు. రెండు ప్రధానమైన కారణాలతో ఉప్పుటేరులో నీటి పారుదల కావడం లేదని, కొంత మంది రైతులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉప్పుటేరును ఆక్రమించి చెరువులు తవ్వకాలు చేశారని దీంతో 247 మీటర్ల వెడల్పు కాస్తా 80 మీటర్లకు తగ్గిందని, ఇది నీటి ప్రవాహానికి అవరోధంగా మారిందన్నారు.

అలాగే ఉప్పుటేరుపై రైల్వే డబ్లింగ్ పనుల్లో నిర్మించిన బ్రిడ్జి పిల్లర్లు ఎత్తు అత్యంత దారుణంగా పెంచి ముంపు సమస్యను దృష్టిలో పెట్టుకోకుండా రైల్వే ఇంజనీరింగ్ అధికారులు అవగాహన లోపంతో నిర్మించారన్నారు. గతంలో నిర్మించిన పాతబ్రిడ్జికి స్పాన్, స్పాన్‌కి మధ్య 30 గజాల ఖాళీ ఉందని ప్రస్తుతం నిర్మించిన బ్రిడ్జికి రెండు పిల్లర్లకి మధ్య 10 గజాలు మాత్రమే ఖాళీ వదిలారని దీంతో నీటి పారుదల కావడం లేదన్నారు. ఉప్పుటేరు మార్గం ద్వారా 10 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్లాల్సి ఉండగా వీటి నిర్మాణంతో 5 వేల క్యూసెక్కుల నీరు కూడా పారుదల అయ్యే పరిస్థితులు కనబడడం లేదన్నారు. రైల్వే అధికారులు నిర్మాణ దశలో వినియోగించిన 6 మీటర్ల వెడల్పు ఉన్న పైపులైన్ తొలగించకుండా వదిలివేశారన్నారు. దీనిపై శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామని దీనిపై ఆయన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ముంపు నివారణకు అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటామని కామినేని వెల్లడించారు. భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, ఆకివీడు, కైకలూరు డ్రెయినేజీ డీఈలు వినోద్, రామకృష్ణ, ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర చేపల రైతుల సం ఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, వడ్డి సాధికార సమితి కన్వీనర్ ఏసురాజు, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్ర రావు, కూటమి నేత కొల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించండి...

పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కామినేని అన్నారు. సోమవారం వరహాపట్నంలో కైకలూరు పంచాయతీ కార్మికులు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆరు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే జిల్లా పంచాయతీ అధికారి అనూరాధతో ఫోన్లో మాట్లాడారు. ఈ నెల 31వ తేదీలోపు కార్మికులకు ఎట్టి పరిస్థితుల్లోనూ జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, వాటర్ వర్కర్స్, ఎలక్ట్రీషియన్లు, ట్రాక్టర్ డ్రైవర్లు తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

మంత్రి పరామర్శ

నూజివీడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పురపాలక కమిషనర్ మందలించారన్న ఆరోపణలతో పురపాలక పారిశుధ్య కార్మికులైన కొండలరావు, రెడ్డమ్మ దంపతులు ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసిన విషయం విదితమే. వీరు నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. వీరిని నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం ఫోన్లో పరామర్శించి ధైర్యం చెప్పారు. నూజివీడు పురపాలక సంఘం కౌన్సిల్ వీరికి రూ. పదివేల ఆర్థిక సాయం అందించింది.



సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి : సీఐ

కైకలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల అవగాహన కలిగియుండాలని కైకలూరు టౌన్ సీఐ పి. కృష్ణ అన్నారు. సోమవారం కైకలూరు జడ్పీ బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, పోక్సోచట్టంపై వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆన్‌లైన్లో వచ్చే ప్రకటనతో అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా ద్వారా పరిచమయ్యే వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని స్నేహం పేరుతో అనేక మోసాలకు పాల్పడుతుంటారన్నారు. అలాగే ఆన్‌లైన్లో డిస్కౌంట్ల ధరలకు వస్తువలకు ఆశపడి డబ్బులు చెల్లించి మోసపోవద్దని సూచించారు. ఎస్సై ఆర్. శ్రీను, హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంగన్వాడీలకు ఒకే రకమైన యాప్‌ను అందించాలి

కైకలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు ప్రభుత్వ ఇచ్చిన వివిధ రకాల యాప్‌ల వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని అన్ని సేవలకు ఒకే రకమైన యాప్‌ను అందించాలని అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు పి. సుజాత డిమాండ్ చేశారు. సోమవారం కైకలూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఫోన్లు సైతం పాతవి కావడంతో పనిచేయడం లేదని వాటి స్థానంలో కొత్త ఫోన్లు అందజేయడంతో పాటు యాప్‌లను తొలగించాలని కోరారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫెట్స్‌ను అందించాలని డిమాండ్ చేశారు. సీడీపీవో దీప్తికి వినతిపత్రాలు అందజేశారు. యూనియన్ నాయకులు చల్లమ్మ, మీనాకుమారి, అబీదాబేగం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం



పెదగొన్నూరు సుపరిపాలనలో పాల్గొన్న కామినేని

ముదినేపల్లి, జూలై 21 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశా జనకంగా లేకున్నా, గత వైసీపీ ప్రభుత్వం అప్పులు అప్పచెప్పినా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పలు పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. పెదగొన్నూరులో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ఇంటింటా కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను పెంచేందుకు కూడా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.

ఆగిరిపల్లి: సుపరిపాలనతోనే గ్రామాల అభివృద్ధి అని పిన్నమరెడ్డిపల్లి టీడీపీ గ్రామ అధ్యక్షుడు కుంపటి కోటేశ్వరరావు అన్నారు. రాజవరంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరిస్తూ, కరపత్రాలను అందజేశారు. నూజివీడు నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు జన్ని రాంబాబు, రొంపిచర్ల గిరిధర్, గ్రామ ప్రధాన కార్యదర్శి గోళ్ళ చిన్నబాలయ్య, గ్రామ ఉపాధ్యక్షుడు గోళ్ళ చంటి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి యలమర్తి సువర్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైనా అందని 'వందనం'?



ముదినేపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామంలోని ఓ పేద కుటుంబం తల్లికి వందనం పథకం లబ్ధి కోసం ఎదురుచూస్తూనే ఉంది. గ్రామానికి చెందిన కారె కిరణ్, శాంతి దంపతుల కుమార్తెలు రిషిత, జాస్మిన్ అదే గ్రామంలోని మండల పరిషత్తు ఎలిమెంటరీ పాఠశాలలో రెండు, నాల్గవ తరగతి చదువుతున్నారు. వారిరువురూ తల్లికి వందనం తొలి జాబితాలోనే అనర్హులుగా పేర్కొన్నారు. దీనిపై అప్పట్లోనే ఆరా తీయగా, విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు దాటినట్లు కనిపించింది. వాస్తవానికి కిరణ్ పేరున కాని, శాంతి పేరున కాని విద్యుత్ కనెక్షన్ లేదు. ఎందుకని ఇలా జరిగిందని తెలుసుకోగా, విద్యార్థుల తల్లి శాంతి ఆధార్ నెంబర్ ఏలూరులోని రెండు విద్యుత్ సర్వీసులకు లింక్ అయినట్లు తేలగా, వారు ఏలూరు విద్యుత్ సెక్షన్ కార్యాలయానికి వెళ్లి వివరాలు సేకరించి పెయ్యేరు గ్రామ సచివాలయంలో అందజేశారు. ఆ కుటుంబం పేరున విద్యుత్ సర్వీసు లేనట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయినా రెండో జాబితాలో కూడ తల్లికి వందనం సొమ్ము జమ కాలేదు. దీంతో ఆ కుటుంబం సొమ్ము కోసం ఎదురుచూస్తోంది.

జనం చెంతకు.. తొలి అడుగు

(5వ పేజీ తరువాయి)

శైలిలో ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. సాధ్యమైనంత మేర అధికారుల నుంచి సమాచారం రాబట్టి ఆయా సమస్యలను ఎప్పటిలోగా పూర్తి చేయగలుగుతామో భరోసా ఇస్తున్నారు. స్థానికులతో కలిసిపోవడం ఒక ఎత్తైయితే చొరవ తీసుకుని దూకుడుగా ముందుకు వెళ్లడంలో సీనియర్‌గా ప్రభాకర్ సక్సెస్ అయ్యారు. మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడు నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ తొలి అడుగులో పాల్గొన్నారు. ఆయన పర్యటించడానికి కుదరని పక్షంలో పార్టీ నేతలే దగ్గరుండీ మరీ ఆయా గ్రామాల్లో సుపరిపాలన గురించి వివరిస్తున్నారు. చింతలపూడి నియోజక వర్గంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ తొలి అడుగు ఆరంభంలో అందుకోలేకపోయారు. ఇప్పుడు తాజాగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. స్థానిక నేతలను కలుపుకుని పోయి ఇంటింటికి తిరుగుతున్నారు. కూటమి ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, కామినేని శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో స్థానిక కేడర్‌తో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జులు, పార్టీ పరిశీలకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు బాధ్యత తీసుకుని గడపగడపకూ వెళుతున్నారు. దీనికి తోడు ఏ రోజుకారోజు కార్యక్రమం అమలు చేస్తున్న తీరు, పాల్గొంటున్న నేతల వివరాలను అధినాయకత్వానికి నివేదిస్తున్నారు. జిల్లాలో పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వివిధ నియోజకవర్గాలను సమన్వయం చేస్తూనే, ఆయన స్వయంగా ఉంగుటూరు నియోజకవర్గంలో తొలి అడుగులో పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏసుబాబు



మండవల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా మండవల్లి మండల అధ్యక్షుడు సమయం ఏసుబాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ తనకు పదవి రావడానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సహాయ సహకారాలతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమకిషోర్, పార్టీ నాయకుల కృషే కారణమని వారికి కృతజ్ఞతలు తెలిపాడు.



పెద్దింటమ్మకు సారె సమర్పణ

కైకలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటమ్మవారికి సోమవారం కొల్లేటికోట, లక్ష్మీపురం, ఏలూరు నుంచి మహిళలు పెద్దఎత్తున ఆషాఢ సారె సమర్పించారు. మహిళలకు వస్త్రాలను, కుంకుమ, గాజులు, ప్రసాదాన్ని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అందజేశారు.

ముదినేపల్లి: వడాలిలోని 14 ఆలయాల్లో అమ్మవార్లకు పెద్ద సంఖ్యలో మహిళలు సోమవారం ఆషాఢ సారె సమర్పించారు. సీతమ్మ, అంకమ్మ, పార్వ తీ దేవి, సువర్చలా, దుర్గమ్మ, గంగానమ్మ, మాతమ్మ, రుక్మిణి దేవి, రేణుకా అంకమ్మతోపాటు పలు రామాలయాల్లో సీతాదేవికి, జగన్నాథస్వామి ఆలయంలో సుభద్రా దేవికి సారె అందజేసి పూజలు నిర్వహించారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి రామాలయంలోని సీతమ్మ వారికి మహిళలు సారెను సమర్పించారు.

కుల బహిష్కరణపై ఫిర్యాదు

నూజివీడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం సుంకొల్లు గ్రామంలో తమను కుల బహిష్కరణ చేశారంటూ తొలిమెల్లి మీనాక్షి సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వెట్రిసెల్వికి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ తమ సామాజిక వర్గంలోని ఆరుగురు పెద్దలు తమను కుల బహిష్కరణ చేసినట్లు తెలిపారు. మరో రెండు కుటుంబాలు తమకు అండగా ఉండడంతో వారిని కూడా కుల బహిష్కరణకు గురి చేశారని వాపోయారు. కుల బహిష్కరణ చేసిన వారందరిపై కఠిన చర్యలు చేపట్టి, తమకు రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

పీహెచ్‌సీలో సిబ్బందిని నియమించాలని అర్జీ

మండవల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండవల్లి పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్, సిబ్బందిని నియమించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు కోరారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాయకులు ఎల్ఎస్ భాస్కరరావు, టి. అప్పారావు, జి. శ్రీనివాసరావు, వై. శ్రీనివాసరావు ఎమ్మార్వో గోపాల్‌కు అర్జీ అందజేశారు. పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేకపోటంతో రోగనిర్ధారణ కోసం రక్త పరీక్షలు చేయించుకునేందుకు రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లవలసి వస్తుందన్నారు. పీహెచ్‌సీలో మొత్తం 63 రకాల రక్తపరీక్షలు చేయించాల్సి ఉన్నప్పటికీ కేవలం మధుమేహం లాంటి 3, 4 రక్తపరీక్షలు చేస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా, రెండేళ్లుగా ఒకే మెడికల్ ఆఫీసర్ పనిచేస్తున్నారని తెలిపారు. ఆసుపత్రి శిథిలావస్థకు చేరిందని తక్షణం సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నిందితుడి అరెస్ట్

చాట్రాయి, జూలై 21(ఆంధ్రజ్యోతి): గతంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన పోతనపల్లి గ్రామానికి చెందిన ధరావతు నాగరాజును సోమవారం అరెస్ట్ చేసి తిరువూరు కోర్టులో హాజరుపర్చినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహించే వారిపైనా, సారా తయారీ, అమ్మకం దారులపైనా, బెల్లం ఊట కలిగిన భూమి యజమానులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

కలిదిండి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు కాల్వలో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆచూకీ తెలిసిందని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కోరుకొల్లుకు చెందిన చెన్నంశెట్టి శివ (35)గా బంధువులు గుర్తించారన్నారు. ఈ నెల 18వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి కోరుకొల్లు కాల్వ వద్దకు వెళ్లి ప్రమాద వశాత్తు కాల్వలో పడి చనిపోయాడన్నారు. మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



మద్దాల అనిత మృతదేహం

ముసునూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి- అక్కిరెడ్డిగూడెం ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. విశాఖపట్నం నుంచి జిప్సం లోడ్‌తో చెక్కపల్లిలోని గ్రోమోర్ కంపెనీకి వస్తున్న లారీ గ్రామ శివారులోని వే బ్రిడ్జి వద్దకు వెళుతోంది. అయితే లోపూడికి చెందిన మద్దాల అనిత(27), చిన్న కుమారుడు శశాంక్‌లను ఆమె మేనల్లుడు నవీన్ బైక్‌పై రమణక్కపేట పీహెచ్‌సీకి వైద్యం నిమిత్తం తీసుకువెళుతుండగా లారీని తప్పించే క్రమంలో లారీ ఒక్కసారిగా వీరి మీదకు రావడంతో అదుపుతప్పి రహదారిపై పడ్డారు. ఈ ప్రమాదంలో అనితపై లారీ చక్రం ఎక్కింది. ఆమెను 108లో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతి చెందింది. మృతురాలి మేనల్లుడు నవీన్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడు శశాంక్‌కు స్వల్ప గాయాలు కాగా చికిత్స చేసి కుటుంబీకులకు అప్పగించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

యాప్ డౌన్‌లోడ్‌తో తంటా.. రూ. 2.10 లక్షల చోరీ

కైకలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవడంతో సైబర్ నేరగాళ్ళు రూ.2.10లక్షలు కాజేసిన ఘటనపై కైకలూరు రూరల్ ఎస్సై వి. రాంబాబు కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల ప్రకారం మండలంలోని వరహాపట్నం గ్రామానికి చెందిన బోయిన నాగశ్రీనివాస్‌కి పీఎం కిసాన్ ఏపీకె ఫైల్ యాప్ వచ్చింది. ఈ యాప్‌ను అతను డౌన్‌లోడ్ చేయగా వెంటనే ఫోన్ ఆగిపోయింది. ఎంతకీ ఫోన్ ఆన్ కాకపోవడంతో మొబైల్ షాపులో మరమ్మతుకు ఇచ్చాడు. మరమ్మతు అనంతరం ఫోన్ ఆన్ చేయగా రూ.1,33,000 క్రెడిట్ లోన్ తీసుకున్నట్లుగా మెస్సేజ్ వచ్చింది. కొద్దిసేపటికి మరో రూ.77 వేలు క్రెడిట్ లోన్ తీసుకున్నట్లుగా మరో మెస్సేజ్ వచ్చింది. దీంతో అప్రమత్తమై బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా క్రెడిట్ లోన్ తీసుకున్నట్లుగా ధ్రువీకరించారు. దీంతో ఖాతాను నిలుపుదల చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయితో దాడి

కైకలూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): రహదారిపై అడ్డుగా బుసక వేశారని ప్రశ్నించిన వ్యక్తిపై దాడి చేసిన సంఘటన కైకలూరు మండలం భుజబలపట్నంలో చోటుచేసుకుంది. కైకలూరు రూరల్ ఎస్సై రాంబాబు వివరాల ప్రకారం భుజబలపట్నం గ్రామానికి చెందిన జంగం ఏలియా గ్రామంలోని రహదారి వెంబడి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన సదర్ల ఏసయ్య అతని కుమారుడు బన్ను రహదారికి అడ్డుగా బుసక గుట్టలను దించడంతో రాకపోకలకు అడ్డుగా ఉన్నాయని పక్కన దించుకోవచ్చు కదా అని ఏలియా అన్నాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఏసయ్య, బన్ను ఆకురాయితో దాడి చేశారు. దీంతో ఏలియాకు గాయాలు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.